thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 87 | జగిత్యాల | బుధవారం | 24 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఇంగ్లండ్ టూర్ కు యువభారత్ జట్టు



11

## పద్మ పురస్కారాలతో రాష్ట్రపతి భవన్ కళకళ

- మమ్ముట్టి, విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్
- శిబు సోరెన్‌కు మరణానంతర గౌరవం
- మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌కు పద్మశ్రీ

02



## మెట్రోపై సీఎం, కేంద్ర మంత్రి డ్రామాలు

- రేవంత్, కిషన్ రెడ్డి మెట్రో ఆస్తులపై కన్నేశారు..
- రైతుల సమస్యలపై పోరాడితే గృహ నిర్బంధాలా ?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 23:**

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కలిసి రాజకీయ నాటకాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన, రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారని

మిగతా 3వ పేజీలో..





# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

- ఫేజ్-1 వాల్యుయేషన్. ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్‌గా 'ఎస్‌బీఐక్యాప్స్'
- కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
- సమన్వయ సభ్యులుగా కేంద్ర అధికారి, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ
- ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల సంయుక్త సమావేశంలో నిర్ణయం
- కేంద్ర మంత్రులతో సిఎం రేవంత్ చర్చలు ఫలప్రదం

**ఢిల్లీ, జూన్ 23 :**

హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఉదయం ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- 1 వాల్యుయేషన్, ఫేజ్-1 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్-2

మిగతా 2వ పేజీలో..

## రేవంత్ పాలనంతా స్కాములే.. స్కీములు లేవు



- అచ్చంపేట నుండి అశ్వరావుపేట వరకు ఒకటే మాట వినిపిస్తుంది
- మాకు మళ్లీ కేసీఆరే రావాలి'..
- ప్రజల ఆకాంక్ష ఇదే
- బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు

2



## ఏసీబీ వలలో ఎక్సైజ్ సూపరింటెండెంట్

- నిజామాబాద్ అధికారిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
- 11 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు

3

## ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

- సీఎంఆర్ గడువునూ పొడిగించాలి
- రైతుల పక్షాన కేంద్ర మంత్రిని కలసిన రాష్ట్ర ప్రతినిధి బృందం
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

3



## సర్ సదస్సులతో బీఆర్ఎస్‌లో జోష్

- కేసీఆర్ మార్గదర్శకత్వంలో సభలు
- రాష్ట్రవ్యాప్తంగా కేటీఆర్, హరీష్‌రావు విస్తృత పర్యటనలు
- అవగాహన కార్యక్రమాల పేరుతో కేడర్‌కు భరోసా
- నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి

2





## కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జూన్ 23:**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని

మిగతా 2వ పేజీలో..



## పేరు పెడితే రూ.లక్ష

- లక్ష ఫ్లాట్ల పథకానికి పేర్ల ఆహ్వానం
- ఉత్తమ పేరుకు నగదు బహుమతి
- ఈ నెల 28 వరకు అవకాశం
- హౌసింగ్ బోర్డు వినూత్న పోటీ

**హైదరాబాద్, జూన్ 23:**

తెలంగాణలో అల్పాదాయ వర్గాల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న లక్ష ఫ్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారు చేసేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజల నుంచే పేర్లను

మిగతా 2వ పేజీలో..

## స్వయం సమృద్ధి గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

- అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు
- గ్రామాలకు వచ్చే ప్రతీ రూపాయి ప్రజల జీవితాల్లో మార్పు తేవాలి
- అలసత్వం, నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించబోం
- గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్రస్థాయి సమీక్షలో మంత్రి సీతక్క

3



2



## ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు మార్గదర్శకాలు

- కలెక్టర్లకు పూర్తి అధికారాలు
- డెప్యుటేషన్ టీచర్లను ప్రస్తుతం రిలీవ్ చేయొద్దు
- విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చర్యలు

**హైదరాబాద్, జూన్ 23:**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు, మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు

మిగతా 3వ పేజీలో..



## టీజీఈసెట్ తొలి విడతలో 59 శాతం సీట్లు భర్తీ

- 8,829 మందికి సీట్ల కేటాయింపు
- జూన్ 27లోపు ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ తప్పనిసరి
- తుది విడత తర్వాత జూలై 10 నుంచి కాలేజీల్లో రిపోర్టింగ్

3

# పేరు పెడితే రూ.లక్ష

**మొదటిపేజీ తరువాయి**

ఆహ్వానిస్తూ, ఉత్తమమైన పేరును సూచించిన వ్యక్తికి రూ.లక్ష నగదు బహుమతి ప్రకటించింది.

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా క్యూర్ పరిధిలో లక్ష ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు కానున్న ఈ భారీ గృహ నిర్మాణ ప్రాజెక్టుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే ఉద్దేశంతో ఈ పోటీ నిర్వహిస్తున్నారు.


తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 28వ తేదీ వరకు ప్రజల నుంచి పేర్ల సూచనలను స్వీకరిస్తారు. వచ్చిన ప్రతిపాదనల్లో ఉత్తమమైన పేరును ఎంపిక చేసి, ఆ పేరును సూచించిన వ్యక్తికి రూ.లక్ష నగదు బహుమతి అందజేయనున్నారు.

**సోషల్ మీడియాలో సూచనలు**

పోటీలో పాల్గొనాలనుకునే వారు హౌసింగ్ శాఖ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా tghd.official ద్వారా తమ సూచనలను పంపవచ్చు. ఈ కార్యక్రమంలో ఎక్కువ మంది ప్రజలు పాల్గొనేలా సోషల్ మీడియా వేదికను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**త్వరలో పూర్తి వివరాలు**

క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణానికి అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించారు. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ, అర్హతలు, లాటరీ విధానం ద్వారా ఇళ్ల కేటాయింపు వంటి పూర్తి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయనుంది. సుదీర్ఘ విరామం తర్వాత చేపడుతున్న ఈ భారీ గృహ నిర్మాణ ప్రాజెక్టుపై అల్పాదాయ వర్గాల ప్రజల్లో ఆసక్తి నెలకొంది. సొంతింటి కలను సాకారం చేసే ఈ పథకానికి ప్రజలే పేరు పెట్టే అవకాశం కల్పించడం విశేషంగా మారింది.



# పద్మ పురస్కారాలతో రాష్ట్రపతి భవన్ కళకళ

**న్యూఢిల్లీ, జూన్ 23:**

దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు.

భారతీయ సినీ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా మలయాళ సినీ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో భారత టెన్నిస్‌కు విశేష గుర్తింపు తీసుకొచ్చిన విజయ్ అమృత్‌రాజ్‌కు కూడా పద్మభూషణ్ అవార్డు అందజేశారు. వైద్య రంగంలో చేసిన సేవలకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని పద్మభూషణ్‌తో సత్కరించారు.

గిరిజనుల హక్కుల కోసం దీర్ఘకాలం పోరాటం చేసిన జేఎంఎం వ్యవస్థాపకుడు శిబు సోరెన్‌కు మరణానంతరం పద్మభూషణ్ పురస్కారం ప్రకటించారు. ఆయన తరఫున సతీమణి రూపి సోరెన్ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.

తెలుగు చలనచిత్ర రంగానికి చెందిన సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌లకు పద్మశ్రీ పురస్కారాలు లభించాయి. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన వేడుకలో వారు అవార్డులను అందుకున్నారు. విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా తెలంగాణకు చెందిన శాస్త్రవేత్త చంద్రమౌళికి పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులు, విశిష్ట వ్యక్తుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

# రేవంత్ పాలనంతా స్కాములే.. స్కీములు లేవు

**అశ్వారావుపేట జూన్23:**

కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు విమర్శించారు. అశ్వారావుపేటలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

అచ్చంపేట నుంచి అశ్వారావుపేట వరకు ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా వంటి హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రైతులకు నష్టపరిహారం అందించకపోవడంతో పాటు యూరియా సరఫరాలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు.బీఆర్ఎస్ హయాంలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వంటి పథకాలు అమలు చేశామని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు కేటాయించిన నిధులు విడుదల కాకపోవడంతో దళితులు, గిరిజనులు నష్టపోతున్నారని ఆరోపించారు.ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగలేదని, సీతారామ ప్రాజెక్టు పనులు మందగించాయని, అశ్వారావుపేటలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని అన్నారు.మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలపై స్పందించిన హరీష్ రావు, రైతు బంధు నిధుల అంశంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# స్వయం సమృద్ధి గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

తీసిపోని మౌలిక వసతులతో తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ, సెర్ప్, ఉపాధి హామీ పథకం తదితర విభాగాల అధికారులతో మంత్రి సీతక్క సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏడు గంటలపాటు సాగిన సమావేశంలో శాఖల వారీగా పనుల పురోగతి, భవిష్యత్తు లక్ష్యాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో సుమారు 1.35 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఏటా రూ.34 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చవుతున్నాయని గుర్తు చేశారు. ఇంత భారీ యంత్రాంగం, నిధులు ఉన్నప్పటికీ గ్రామాల రూపురేఖలు ఆశించిన స్థాయిలో మారకపోవడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. 'ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనిచేస్తే ఫలితాలు రావు.. జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులు ఒకే టీమ్‌గా పనిచేయాలి.. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి.. ప్రతీ గ్రామానికి అవసరాలు, వనరులు, సమస్యలను గుర్తించి వాటి ఆధారంగా కార్యాచరణ అమలు చేయాలి' అని ఆదేశించారు. గ్రామాల్లో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగిస్తే గంగదేవిపల్లి వంటి ఆదర్శ గ్రామాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్మించవచ్చని మంత్రి అన్నారు. వచ్చే రెండు నెలల్లో గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి తీసుకురావాలని అధికారులకు గడువు విధించారు. గ్రామాలకు వచ్చే ప్రతీ రూపాయి ప్రజల ప్రయోజనాలకే ఖర్చు కావాలని స్పష్టం చేసిన మంత్రి ఒక్కో నీటి బొట్టును ఎలా పొదుపుగా వాడుకుంటామో గ్రామాలకు వచ్చే ప్రతీ రూపాయిని కూడా అంతే జాగ్రత్తగా వినియోగించాలి. ప్రజల డబ్బును వృథా చేయడానికి ఎవరికీ హక్కు లేదు అని అన్నారు. స్థానిక సంస్థల నిధుల వినియోగంపై మాట్లాడుతూ కొన్నిచోట్ల గ్రామ సభలు నిర్వహించకుండా నిధులు ఖర్చు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు నిధుల వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. 'నేను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాను.. జిల్లాల్లో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటాను.. నిర్లక్ష్యం, అలసత్వం, బాధ్యతారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు' అని మంత్రి అధికారులను హెచ్చరించారు. సమీక్షలో ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పని దినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులు, అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణాలు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు, పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్లు, స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధన, గ్రామ కార్యదర్శుల హాజరు తదితర అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు.

**జల సంరక్షణే భవిష్యత్ భద్రత**

వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. చెరువులు, కుంటలు, బావులు, వాగులను పరిరక్షించడం గ్రామీణాభివృద్ధిలో అత్యంత కీలకమన్నారు. 'చెరువును కాపాడుకుంటే ఊరిని కాపాడుకున్నట్టే.. పాత బావులను గుర్తించి పునరుద్ధరించాలి.. బావుల చుట్టూ రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలను నివారించాలి.. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరిలో ఊట కుంట ఉండేలా చర్యలు చేపట్టాలి' అని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'జలసిరి' అవగాహన పోస్టర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

**ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు చేరాలి**

వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మిషన్ భగీరథ అధికారులకు మంత్రి సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు సహా ప్రతి ఇంటికీ నిరంతరాయంగా రక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిర్మిస్తున్న రహదారులకు కేంద్ర అటవీ శాఖ నుంచి అనుమతుల సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. 'పట్టణాల్లో స్కైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తుంటే అటవీ గ్రామాల్లో కనీసం బీటీ రోడ్డు వేయడానికీ అనుమతులు రావడం లేదు.. కేంద్రం నిధులు మంజూరు చేసిన తర్వాత కూడా అనుమతుల పేరుతో అడ్డంకులు సృష్టించడం వల్ల ఆదివాసి గిరిజన గ్రామాలు ఇంకా వెనకబాటులోనే ఉన్నాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరగనున్న సమావేశంలో రాష్ట్ర సమస్యలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. పీఎంజీఎస్‌వై కింద అటవీ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, కేంద్రంతో సంప్రదింపులు జరిపేందుకు శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు.

**మహిళా సంఘాలే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక**

మహిళా సంఘాల బలోపేతం, బ్యాంకు లింకేజీల పెంపు, మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సెర్ప్ అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళల ఆర్థిక సాధికారత పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సమావేశం ముగింపులో మంత్రి సీతక్క మాట్లాడుతూ 'మనందరిదీ గ్రామీణ నేపథ్యమే.. గ్రామీణ ప్రజల కష్టాలు మనకు తెలుసు.. కాబట్టి గ్రామాల్లో సమస్యలు తలెత్తకముందే పరిష్కారాలు చూపాలి.. తెలంగాణ గ్రామాలను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే బాధ్యత మనందరిది' అని అధికారులకు పిలుపునిచ్చారు.

**మెరుగైన పనితీరు కనబరుస్తున్న అధికారులకు సన్మానం**

హోదాను పక్కనపెట్టి మెరుగైన పనితీరును కనబరుస్తున్న అధికారులను మంత్రి సీతక్క శాలువాతో సన్మానించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కేవలం రెండున్నర నెలల్లో 7.44 కోట్ల పని దినాలు పూర్తి చేసినందుకు సెక్రటరీ దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్‌లను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. జిల్లాస్థాయిలో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా రికార్డు స్థాయిలో అమలు చేసినందుకు డీఆర్డీవోలకు స్వీట్ బాక్స్‌లు అందజేశారు. దివ్యాంగులకు యూడిఐడి కార్డులను అందించడంలో కీలక పాత్ర పోషించిన సెర్ప్ డైరెక్టర్ సాయికుమార్‌ను అభినందించి సన్మానించారు.

# సర్ సదస్సులతో బీఆర్ఎస్‌లో జోష్

**హైదరాబాద్, జూన్ 23**

తెలంగాణలో ప్రస్తుతం ఎన్నికల వాతావరణం లేకపోయినా బీఆర్ఎస్ అగ్రనేతలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు నిర్వహిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించే కార్యక్రమాలను పార్టీ సంస్థాగత బలోపేతానికి వినియోగించుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కేటీఆర్, హరీష్‌రావు జిల్లాల వారీగా పర్యటిస్తూ నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నేతలతో ముఖాముఖి చర్చలు జరుపుతూ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఏలను నియమించి వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

సదస్సుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కూడా నాయకత్వం కీలక సూచనలు చేస్తోంది. తదుపరి ఎన్నికలకు సమయం తగ్గుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో కార్యాచరణ సాగుతున్నట్లు తెలుస్తోంది.



**కేడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నం**

నియోజకవర్గ సమన్వయ సమావేశాల్లో కేటీఆర్, హరీష్‌రావు కార్యకర్తలను ఉత్సాహపరిచే విధంగా ప్రసంగిస్తున్నారు. స్థానిక సమస్యలతో పాటు రాష్ట్ర రాజకీయ పరిణామాలపై కూడా స్పందిస్తూ పార్టీ శ్రేణుల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో ఈ సమావేశాలకు కార్యకర్తల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకే రోజులో రెండు లేదా అంతకంటే ఎక్కువ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తూ నేతలు కేడర్‌తో ప్రత్యక్షంగా మమేకమవుతున్నారు. మాజీ మంత్రులు, ఇతర రాష్ట్ర స్థాయి నాయకులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**కేసీఆర్ మార్గదర్శకత్వంలో కార్యక్రమాలు**

నియోజకవర్గాల వారీగా జరుగుతున్న సమన్వయ సమావేశాలను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏ అంశాలపై దృష్టి పెట్టాలనే విషయాల్లో నాయకత్వానికి సూచనలు అందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సగానికి పైగా నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తవగా, మిగిలిన ప్రాంతాల్లో కూడా కార్యక్రమాలను విస్తరించాలని పార్టీ యోచిస్తోంది. ఎస్ఐఆర్ అవగాహన సదస్సుల రూపంలో నిర్వహిస్తున్న ఈ సమావేశాలు పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతున్నాయని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి.

# ఏసీబీ వలలో ఎక్సైజ్ సూపరింటెండెంట్

**హైదరాబాద్, జూన్ 23:**

రాష్ట్రంలో అవినీతి అధికారులపై కొనసాగుతున్న ఏసీబీ దాడుల్లో మరో ఉన్నతాధికారి చిక్కాడు. నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు మంగళవారం విస్తృత సోదాలు నిర్వహించారు. ఉద్యోగ బాధ్యతలను దుర్వినియోగం చేసి అక్రమంగా భారీ ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన సమాచారంతో ఈ దాడులు చేపట్టారు.

**11 ప్రాంతాల్లో సోదాలు**

మల్లారెడ్డిపై అందిన ఫిర్యాదుల ఆధారంగా అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఏసీబీ, ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీలు, అనుచరులకు సంబంధించిన మరో 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది. మొత్తం 11 చోట్ల నిర్వహించిన ఈ సోదాల్లో భారీ స్థాయిలో స్థిర, చరాస్తులు వెలుగులోకి వచ్చాయి. ప్రాథమిక విచారణలో నాలుగు నివాస గృహాలు, ఒక వాణిజ్య సముదాయం, ఎనిమిది ఖాళీ స్థలాలు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికార తెలిపారు.

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి**

విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా 'ఎస్‌బీఐక్యాప్స్'(SBICAPS)ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్ 1 వాల్యుయేషన్, ఫేజ్ 2 విస్తరణ, ఇతర అంశాలపై ఈ సంస్థ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తు కార్యాచరణ చేపట్టనున్నారు. అధ్యయనం సమయంలో కన్సల్టెంట్ సంస్థతో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి(ఎంఏ అండ్ యూడీ) శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరూ సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. అలాగే, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు.

**రేవంత్ కోరారు.. కేంద్ర మంత్రులను కలిసాం : 'ఎక్స్'లో కిషన్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో



రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ డియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని 'ఎక్స్'లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

**హైదరాబాద్, జూన్ 22:**

తెలంగాణ రైతుల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రబీ 202526 సీజన్‌లో రికార్డు స్థాయిలో జరిగిన వరి కొనుగోళ్ల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సేకరణ లక్ష్యాలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని, కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గడువులను పొడిగించాలని కోరుతూ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ వినతిపత్రం అందజేశారు. సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంగళవారం ఉదయం దిల్లీలో కేంద్ర మంత్రిని కలిశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు ఒక్క గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. దేశంలోనే అత్యధికంగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించిందని, కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. ఖరీఫ్, రబీ కలిపి 202526 మార్కెటింగ్ సీజన్‌లో 152 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా వరి సేకరణ జరిగి రిత్రాత్మక రికార్డు నమోదవగా రాష్ట్రం పంపిన ఉత్పత్తి అంచనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వరి సేకరణ లక్ష్యాలను తక్కువగా నిర్ధారించడం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందని ఆయన వివరించారు. రబీ 202526 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ అంచనాలు సమర్పించినప్పటికీ కేంద్రం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (51.47 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానం) మాత్రమే లక్ష్యంగా నిర్ణయించిందని మంత్రి తెలిపారు. అయితే రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర లక్ష్యాలను మించి కొనుగోళ్లు నిర్వహించిందన్నారు. గత మూడు సీజన్లలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు మించి రాష్ట్రం 69.50 లక్షల మెట్రిక్ టన్నుల వరిని అదనంగా కొనుగోలు చేయాల్సి వచ్చిందని, దీనివల్ల రాష్ట్ర ఖజానాపై రూ.16,446 కోట్ల అదనపు ఎంఎస్‌పీ భారం పడిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తీవ్ర ఎండలు, హమాలీల కొరత, నిల్వ సామర్థ్య సమస్యలు, భారీగా వరి రాక, అకాల వర్షాలు వంటి ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం వెనుకడుగు వేయలేదని స్పష్టం చేశారు. రైతుల నుంచి వచ్చిన ప్రతీ గింజను కొనుగోలు చేసి వారి ఆదాయాన్ని కాపాడటంలో తమ ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. సీఎంఆర్ సరఫరా అంశంపై కూడా మంత్రి కేంద్ర దృష్టికి కీలక విషయాలను తీసుకెళ్లారు. రబీ 202425కు సంబంధించి ఇంకా 5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, ఖరీఫ్ 202526కు సంబంధించి 14.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేంద్ర పూల్‌కు సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. నిల్వ స్థలాల కొరత, ఒకేసారి పలు సీజన్ల కొనుగోళ్లు కొనసాగడం, మిల్లింగ్ సామర్థ్యాలపై ఒత్తిడి వంటి కారణాల వల్ల గడువులు పొడిగించాల్సిన అవసరం ఉందని కోరారు. రబీ 202425 సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, ఖరీఫ్ 202526 గడువును 120 రోజులు పొడిగించాలని కేంద్రాన్ని మంత్రి కోరారు. అలాగే రబీ 202526 సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నుంచి 54.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి పెంచాలని, అంటే ఇప్పటికే సేకరించిన 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానమైన పరిమాణాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. రబీ వరి ఎక్కువగా ఉప్పుడు బియ్యం తయారీకి అనుకూలంగా ఉండటంతో బాయిల్డ్ రైస్ రూపంలో సరఫరా చేసేందుకు అనుమతి ఇవ్వాలని కూడా కోరారు. భవిష్యత్తులో ఖరీఫ్ 202627 సీజన్‌కు సంబంధించి కేంద్రం నిర్ణయించే సేకరణ లక్ష్యాలు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే ఉత్పత్తి, కొనుగోలు అంచనాలకు అనుగుణంగా ఉండాలని మంత్రి సూచించారు. పంటకు సకాలంలో మద్దతు ధర లభించాలంటే కేంద్ర లక్ష్యాలు, వాస్తవ ఉత్పత్తి పరిస్థితులు సమన్వయంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రైతు ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీపడదని, రైతు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర లభించేలా అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటాం అని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# మెట్రోపై సీఎం, కేంద్ర మంత్రి డ్రామాలు

**మొదటిపేజీ తరువాయి**

విమర్శించారు. హైదరాబాద్‌లో పరస్పరం విమర్శలు చేసుకుంటూ, ఢిల్లీలో కలిసి సమావేశాలు నిర్వహించడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని అన్నారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టును రద్దు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో విస్తరణకు అనుమతులు ఇవ్వలేదని ఆరోపిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇద్దరినీ ప్రజలు గుర్తుంచుకుంటారని వ్యాఖ్యానించారు.

**మెట్రో ఆస్తులపై కుట్ర జరుగుతోందన్న ఆరోపణ**

హైదరాబాద్ మెట్రోకు సంబంధించిన వందల ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులపై ప్రభుత్వం కన్నేసిందని కేటీఆర్ ఆరోపించారు. మెట్రో నిర్వహణలో ఉన్న ప్రైవేటు సంస్థపై ఒత్తిడి తీసుకువచ్చి, భారీ ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. గతంలో ప్రతిపాదించిన లక్డీకాపూల్‌పటాన్‌చెరువు మెట్రో మార్గానికి కేంద్రం ఎందుకు ఆమోదం తెలపలేదని ప్రశ్నించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి విమానాశ్రయం వరకు ప్రతిపాదించిన మెట్రో మార్గాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ మళ్లీ వేగం అందుకోవాలంటే కేసీఆర్ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు.

**మూసీ ప్రాజెక్టుపై విమర్శలు**

మూసీ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం భారీ వ్యయాలకు సిద్ధమవుతోందని, అయితే ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో మాత్రం ఆసక్తి చూపడం లేదని కేటీఆర్ ఆరోపించారు. నగర అభివృద్ధి పేరిట ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై కూడా ఆయన ప్రస్తావిస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గానికి ఎంత మేర నిధులు తీసుకొచ్చిందో వెల్లడించాలని ఎమ్మెల్యే గాంధీని డిమాండ్ చేశారు.

**రైతుల సమస్యలపై ఆందోళన**

రాష్ట్రంలో ఎరువుల సరఫరా సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, యూరియా పంపిణీలో అమలు చేస్తున్న విధానాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.

రైతుల తరఫున ప్రశ్నించే నాయకులను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గృహ నిర్బంధాలు, ఆంక్షలతో బీఆర్ఎస్ నాయకులను గానీ, రైతులను గానీ భయపెట్టలేరని హెచ్చరించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

# ప్రముఖ రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

- కంచి కేఫ్, కోడికూర చిట్టిగారేకు నోటీసులు
- అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలపై అధికారుల ఆగ్రహం
- ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 23:**

సైబరాబాద్ పరిధిలోని రెండు ప్రముఖ రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో పలు నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పరిస్థితులు గుర్తించిన అధికారులు సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు.

**కంచి కేఫ్‌లో తీవ్ర లోపాలు**

పుప్పాలగూడలోని కంచి కేఫ్‌లో నిర్వహించిన తనిఖీల్లో కిచెన్, స్టోర్ రూమ్ మధ్య ఓపెన్ డస్ట్‌బిన్లు ఉండటంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు ఈగలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. స్టోర్ రూమ్ సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడం, కూరగాయలు కట్ చేసే ప్రాంతాలు, గ్రైండింగ్ విభాగంలో నీరు నిల్వ ఉండటం కనిపించింది.

వంటకు వినియోగించే కాలీఫ్లవర్‌పై ఫంగస్ ఉండటాన్ని అధికారులు గుర్తించారు. డ్రెయిన్ల వద్ద దుర్వాసన రావడం, ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన పిండిపై వివరాల లేబుల్స్ లేకపోవడం కూడా వెలుగుచూసింది. వంటగది, స్టోర్ రూమ్‌లలో ఈగలు, బొద్దింకలు సంచరిస్తుండటంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

అదనంగా ఉద్యోగుల వైద్య ధ్రువపత్రాలు, క్రిమిసంహారక చర్యలు, నీటి పరీక్షలు, ప్యాకేజింగ్ సామగ్రి పరీక్షలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాల లేబులింగ్, పరిశుభ్రత ప్రమాణాలను వెంటనే మెరుగుపరచాలని ఆదేశించారు.

**కోడికూర చిట్టిగారేలోనూ ఉల్లంఘనలు**

నల్లగండ్లలోని కోడికూర చిట్టిగారే రెస్టారెంట్‌లో నిర్వహించిన తనిఖీల్లో నిల్వ ఉంచిన చికెన్, తీపి పదార్థాలపై ఎలాంటి లేబుల్స్ లేకపోవడం గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన ఆహార పదార్థాలను అధికారులు అక్కడికక్కడే తొలగింపజేశారు.

గ్రైండింగ్ విభాగం సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడంతో పాటు కిచెన్ సీలింగ్ అంతా జిడ్డుగా మారినట్లు గుర్తించారు. వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని ఆదేశించారు.


ఉద్యోగుల వైద్య అర్హత ధ్రువపత్రాలు, ప్యాకేజింగ్ సామగ్రి పరీక్షల రికార్డులు లేకపోవడంతో ఈ రెస్టారెంట్ యాజమాన్యానికీ ఫుడ్ సేఫ్టీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని హెచ్చరించారు.

## ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగించే
# వారిపై కఠిన చర్యలు

- ట్రాఫిక్ శిక్షణ పొందిన గ్రేహౌండ్స్‌తో సైబరాబాద్ సీపీ

**శేరిలింగంపల్లి, జూన్ 23 :**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధుల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన 150 మంది గ్రేహౌండ్స్ పోలీసు సిబ్బందితో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం.రమేష్ (ఐపీఎస్) మంగళవారం సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారం రోజులపాటు నిర్వహించిన ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న సిబ్బందితో సీపీ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాల గురించి వివరాలు తెలుసుకున్నారు. ట్రాఫిక్ విధులను సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, ట్రాఫిక్ నియంత్రణలో పాటించాల్సిన విధానాలు, చట్టపరమైన అంశాలపై సీపీ సూచనలు చేశారు. శిక్షణలో ట్రాఫిక్ నిర్వహణ,ట్రాఫిక్ ఇంజనీరింగ్, చట్టపరమైన విషయాలు తదితర అంశాలపై ఇండోర్ అవుట్‌డోర్ తరగతుల ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. హెల్మెట్ ధారణ, లేన్ క్రమశిక్షణ, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలని, ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని గుర్తు చేశారు. ప్రతి సిబ్బంది ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై చైతన్యం కల్పించాలని ఆదేశించారు.ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో అక్కడ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి.అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రి రెడ్డి, సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు,ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు మార్గదర్శకాలు

**మొదటిపేజీ తరువాయి**

ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించింది. ఈ ప్రక్రియ నిర్వహణకు జిల్లాల కలెక్టర్లకు పూర్తి అధికారాలు అప్పగించింది.

జిల్లాల్లో విద్యార్థుల సంఖ్య, పాఠశాలల అవసరాలు, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల లభ్యతను పరిశీలించి సర్దుబాటు చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. పాఠశాలల అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

ఈ ఏడాది ఏప్రిల్ 22న పని సర్దుబాటు కింద అవసరమైన పాఠశాలలకు డెప్యుటేషన్‌పై పంపిన ఉపాధ్యాయులను ప్రస్తుతం రిలీవ్ చేయవద్దని జిల్లా విద్యాశాఖాధికారులకు స్పష్టం చేసింది. సంబంధిత పాఠశాలల్లో ఆయా సబ్జెక్టులకు అవసరం ఉన్నంతకాలం వారు అక్కడే కొనసాగాలని మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ఉపాధ్యాయుల పదవీ విరమణ, దీర్ఘకాలిక సెలవులు లేదా ఇతర కారణాలతో ఖాళీలు ఏర్పడిన సందర్భాల్లో విద్యార్థుల బోధనకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపింది. అవసరమైతే మిగులు ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ అనుమతితో డెప్యుటేషన్‌పై పంపాలని డీఈఓలకు సూచించింది.

జూన్ 20, 2026 నాటి విద్యార్థుల నమోదు సంఖ్యను ప్రాతిపదికగా తీసుకుని, జీఓ నంబర్ 25 మార్గదర్శకాల మేరకు పాఠశాలల వారీగా, సబ్జెక్టుల వారీగా విశ్లేషణ చేపట్టి సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు అవసరమైన బోధనా సిబ్బంది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# టిమ్స్‌లో 184 ఉద్యోగాలు.. జూలై 6 వరకు దరఖాస్తులకు అవకాశం

- నిమ్స్ ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ
- మెడికల్ ఫ్యాకల్టీ, సాంకేతిక, పరిపాలన విభాగాల్లో ఖాళీలు
- వాక్-ఇన్ ఇంటర్వ్యూలు, ప్రత్యక్ష దరఖాస్తుల ద్వారా ఎంపిక

**హైదరాబాద్, జూన్ 23:**

హైదరాబాద్ సనత్‌నగర్‌లోని తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ (టిమ్స్)లో వైద్య సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిమ్స్ తరహాలో టిమ్స్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అక్కడి ఖాళీల భర్తీ బాధ్యతలను నిమ్స్‌కు అప్పగించింది. ఈ నేపథ్యంలో టిమ్స్‌లో ఖాళీగా ఉన్న 184 కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి నిమ్స్ మూడు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు జూలై 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**మూడు నోటిఫికేషన్లలో 184 పోస్టులు**

మొదటి నోటిఫికేషన్ ద్వారా 31 మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో 5 ప్రొఫెసర్లు, 2 అసోసియేట్ ప్రొఫెసర్లు, 24 అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీలు ఉన్నాయి. కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వీరిని నియమించనున్నారు.

రెండో నోటిఫికేషన్ ద్వారా 122 సాంకేతిక, పరిపాలన పోస్టులను భర్తీ చేస్తారు. ప్రయోగశాలలు, రక్తనిధి, అనస్థీషియా, ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, ఈసీజీ, బయోమెడికల్ విభాగాల సాంకేతిక నిపుణులతో పాటు మెడికల్ రికార్డు అధికారి, సహాయ ప్రజాసంబంధాల అధికారి, గణాంక నిపుణుడు, రిజిస్ట్రార్, ఖాతాల విభాగం, ఆరోగ్య పరిశీలకుడు వంటి పోస్టులు ఇందులో ఉన్నాయి.

మూడో నోటిఫికేషన్ కింద 31 ఇతర సేవల పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో న్యాయ అధికారి, ప్రజాసంబంధాల అధికారి, ప్రధాన భద్రతాధికారి, భద్రతాధికారులు, పర్ఫ్యూజనిస్టులు, బయోమెడికల్ ఇంజనీర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, హార్డ్‌వేర్ ఇంజనీర్, అగ్నిమాపక అధికారి, సహాయ అగ్నిమాపక అధికారులు, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్, ప్లాస్టర్ అసిస్టెంట్లు ఉన్నారు.

**అర్హతలు, వయోపరిమితి**

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు సంబంధిత సూపర్ స్పెషాలిటీ విభాగంలో డీఎమ్, ఎంసీహెచ్, డీఎన్‌బీ లేదా డాక్టర్ ఎన్‌బీ అర్హతతో పాటు నిబంధనల ప్రకారం బోధనా అనుభవం ఉండాలి. ఇతర పోస్టులకు డిగ్రీ, పీజీ, డిప్లొమా, బీఎస్సీ, బీఈ, బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ తదితర అర్హతలు పోస్టుల వారీగా నిర్దేశించారు.

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 50 నుంచి 58 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయో సడలింపు వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా నిబంధనల ప్రకారం సడలింపులు లభిస్తాయి.

**దరఖాస్తు విధానం**

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసేవారు దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి అవసరమైన ధ్రువపత్రాలతో జూలై 6 ఉదయం 9 గంటలకు నిమ్స్‌లో జరిగే వాక్ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి. సాంకేతిక, పరిపాలన, ఇతర పోస్టులకు దరఖాస్తు చేసేవారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు విద్యార్హతలు, అనుభవ ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డు, జనన ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ, నాన్‌క్రీమీ లేయర్, ఈడబ్ల్యూఎస్, సదరం ధ్రువపత్రాలు, అవసరమైతే ఎన్‌వోసీ జతచేసి జూలై 6 సాయంత్రం 4 గంటలలోపు నిమ్స్ కార్యాలయంలో సమర్పించాలి.

**దరఖాస్తు ఫీజులు**

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు సాధారణ అభ్యర్థులు రూ.2,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.1,000 చెల్లించాలి. ఇతర పోస్టులకు సాధారణ అభ్యర్థులు రూ.1,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజును డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో లేదా నిమ్స్‌లోని బిల్లింగ్ కౌంటర్ వద్ద చెల్లించవచ్చు.

**ఎంపిక విధానం**

మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేపడతారు. విద్యార్హతలు, బోధనా అనుభవం, వైద్య అనుభవం, పరిశోధనా ప్రచురణలు, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇతర పోస్టులకు దరఖాస్తుల సంఖ్యను బట్టి ఇంటర్వ్యూ, స్క్రీనింగ్, రాత పరీక్ష, నైపుణ్య పరీక్ష లేదా వీటి సమ్మేళనం ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. పోస్టుల వారీగా పూర్తి వివరాలు, వేతనాలు, రిజర్వేషన్ వివరాలు నిమ్స్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.




# టీజీఈసెట్ తొలి విడతలో 59 శాతం సీట్లు భర్తీ

**హైదరాబాద్, జూన్ 23:**

టీజీఈసెట్ తొలి విడత ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల వెబ్ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. డిప్లొమా, బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులకు లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు సంబంధించిన వివరాలను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, కన్వీనర్ ఎ.శ్రీదేవసేన వెల్లడించారు.

ఈసెట్ పరీక్షలో మొత్తం 17,768 మంది అర్హత సాధించగా, 11,576 మంది సర్టిఫికెట్ ధ్రువీకరణకు హాజరయ్యారు. వీరిలో 11,172 మంది వెబ్ ఆప్షన్లు నమోదు చేశారు. మొత్తం 3,56,192 వెబ్ ఆప్షన్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న 14,890 సీట్లలో తొలి విడతలో 8,829 సీట్లను కేటాయించారు. దీంతో మొత్తం సీట్ల భర్తీ శాతం 59కు చేరింది. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 460 మందికి సీట్లు లభించాయి. స్పోర్ట్స్, ఎన్‌సీసీ కోటాలకు సంబంధించిన సీట్ల కేటాయింపును తుది విడత కౌన్సెలింగ్‌లో చేపట్టనున్నారు.

సీట్లు పొందిన అభ్యర్థులు జూన్ 27లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అనంతరం సెల్ఫ్ రిపోర్టింగ్ విధానం ద్వారా జాయినింగ్ రిపోర్ట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫీజు చెల్లించకపోయినా, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకపోయినా కేటాయించిన సీటు స్వయంచాలకంగా రద్దవుతుందని అధికారులు హెచ్చరించారు. జూన్ 27లోపు సీటును ఆన్‌లైన్‌లో రద్దు చేసుకుంటే చెల్లించిన పూర్తి ఫీజు తిరిగి పొందే అవకాశం ఉంటుంది. తుది విడత కౌన్సెలింగ్ పూర్తైన తర్వాత జూలై 10 నుంచి 13 వరకు కేటాయించిన కళాశాలల్లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరై ప్రవేశ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.

అభ్యర్థులు ఆన్‌లైన్‌తో పాటు కళాశాలలో కూడా యాంటీ డ్రగ్ అఫిడవిట్ డిక్లరేషన్ సమర్పించడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు.

**సీట్ల భర్తీ వివరాలు**

ఇంజనీరింగ్ కోర్సుల్లో 168 కళాశాలల్లో అందుబాటులో ఉన్న 13,610 సీట్లకు గానూ 8,799 సీట్లు భర్తీ అయ్యాయి. ఇది 65 శాతం భర్తీకి సమానం.

ఫార్మసీ కోర్సుల్లో 123 కళాశాలల్లో ఉన్న 1,280 సీట్లకు గానూ 30 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. మొత్తంగా 14,890 సీట్లలో 8,829 సీట్లు కేటాయించబడగా, మొత్తం భర్తీ శాతం 59గా నమోదైంది.

చురకలు





# దేశంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రం!

## మహిళా బిల్లు, డీలిమిటేషన్ ఎత్తుగడలతో ప్రాంతీయ పార్టీలకు చెక్!

దేశంలో రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ డంగయిపోతున్నాయి. బెంగాల్ ఫలితాల తరవాత మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఆమెను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ మెజార్టీ ఎమ్మెల్యేలు తీర్మానం చేశారు. ఇక మహారాష్ట్రలో బాలథాక్రే స్థాపించిన శివసేన దాదాపు అంతర్ధానం అయ్యే దుస్థితిలో ఉంది. యూపిలో అఖిలేశ్ పార్టీలో సైతం ముసలం పుట్టింది. ఇదంతా యాదృచ్ఛికంగా జరుగుతన్నదని భావించడానికి లేదు. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు వీగిపోయిన తరవాత అధికార బిజెపి వేస్తున్న ఎత్తులకు ప్రాంతీయ పార్టీలు చిత్తవుతున్నాయి. ఇదే ఆయా పార్టీల పునాదులను పెకిలిస్తోందని భావించాలి. ఇదంతా కూడా మళ్లీ డీ లిమిటేషన్, మహిళా బిల్లును గట్టెక్కించే పనిలో అధికార పార్టీ చేస్తున్న కసరత్తుగానే గుర్తించాలి. ఈసారి ఈ రెండు బిల్లును ఎలాగైనా గట్టెక్కించే పనిలో మోడీ ద్వయంయ ఉన్నట్లుగా అర్థం అవుతోంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ముసాయిదాను సిద్ధం చేసినా పార్లమెంట్‌లో తగిన మద్దతు దక్కుతుందన్న నమ్మకం కలిగితేనే ఈ బిల్లును సభ ముందుకు తీసుకురావాలని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ చట్టం ఆమోదం పొందాలంటే లోక్‌సభ.. రాజ్యసభల్లో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతటితో ఈ పక్రియ పూర్తి కాదు. దేశంలోని కనీసం సగంరాష్ట్రాల శాసనసభలు ఈ బిల్లును ఆమోదించి తీరాల్సి ఉంటుంది. సంఖ్యాబలంపై పూర్తి ధీమా వచ్చాకే ఎన్డీయే సర్కార్ ఈ మహిళా బిల్లును అధికారికంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. గతంలో జరిగిన అవమానానికి బద్లా తీసుకునే పనిగా కూడా భావిస్తున్నారు. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ల అమలుపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఈ బిల్లును అమలులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెరవెనుక పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. డీలిమిటేషన్.. సీట్ల పెంపు లాంటి కీలక అంశాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ ఓ సరికొత్త ముసాయిదాను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే దీనిని గట్టెక్కించే పనిలో భాగగంఆ బలాన్ని పెంచుకునే ఎత్తులో బిజెపి ఉన్‌ట్లు స్పష్టం అవుతోంది. గతంలో ప్రతగిపాదించినట్లుగానే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను ఏకంగా 50 శాతం పెంచే ఆలోచనలో మోడీ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు వ్యతిరేకించడంతో అది వీగిపోయింది. బెంగాల్, తమిళనాడు ఎన్నికల తర్వాత విపక్షాల బలం తగ్గడంతో మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. మరింత పకడ్బందీగా 133వ రాజ్యాంగ సవరణను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా సీట్ల పునర్విభజన సమయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాలకు చెక్ పెట్టేలా ఈ కొత్త ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పెంపు వల్ల జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే.. రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే కొనసాగించాలని కేంద్రం గట్టిగా భావిస్తోంది. అదే సమయంలో ఒక రాష్ట్రం పరిధిలో నియోజకవర్గాల సరిహద్దుల మార్పునకు మాత్రం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది.ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ కొత్త ముసాయిదా లో అత్యంత కీలకమైన అంశం చట్టసభల స్థానాల పెంపు. లోక్‌సభతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను భారీగా పెంచబోతున్నారు. వీలైనంత వరకు అన్ని చోట్లా ఏకంగా 50 శాతం మేర సీట్లను పెంచాలని కేంద్రం భావిస్తోంది.. సాధ్యమైనంత వరకు 50 శాతం పెంపు విధానాన్ని అమలు చేసి.. మహిళలకు తగినన్ని సీట్లు కేటాయించాలని చూస్తున్నారు. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 55, 81, 82తో పాటు 170, 330లకు మార్పులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న డీలిమిటేషన్ బిల్లులో కూడా తగిన సవరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ఈ కొత్త సూత్రాల ఆధారంగానే తన పనిని కొనసాగించాల్సి ఉంటుంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే ముందుగా సభలో మొత్తం సభ్యుల సంఖ్య పెరగాలి. అప్పుడే సిట్టింగ్ ఎంపీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సీట్ల పెంపు పక్రియతో కేవలం మహిళలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా భారీగా రాజకీయ లబ్ది చేకూరనుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం చూస్తే.. లోక్‌సభలో ఎస్సీ స్థానాలు ప్రస్తుతమున్న 84 నుంచి ఒకేసారి 136కు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఎస్టీల స్థానాలు కూడా 47 నుంచి 70కి పెరగనున్నాయి. ఈ మార్పు చేయడం ద్వారా లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాలకు దక్కాల్సిన పూర్తి 16 శాతం కోటా వారికి అందుతుంది. పెరిగిన ఈ కొత్త స్థానాల్లో మహిళా రిజర్వేషన్లను వర్టికల్ విధానంలో పక్కాగా అమలు చేస్తారని ప్రచారం. అంటే పెరిగిన ఎస్సీ.. ఎస్టీ స్థానాల్లో కూడా మూడో వంతు సీట్లను ఆయా వర్గాలకు చెందిన మహిళలకే కేటాయిస్తారు. ఈ మొత్తం రాజకీయ పక్రియను 2029 సాధారణ ఎన్నికల నాటికి పూర్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. డీలిమిటేషన్ విషయంలో పలు రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేలా ప్రధానమంత్రి కార్యాలయం ఇప్పటికే ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే ఈ భారీ నిర్ణయం అమలు చేయడం ప్రభుత్వానికి అంత సులభం కాదు. దీనికోసం చట్టసభల్లో స్పష్టమైన సంఖ్యాబలం అత్యవసరం. అందుకే ఇప్పుడు ఆయా పార్టీల్లో పగుళ్లు పడుతు న్నాయి. బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో దాదాపు ఆయా ప ఆర్టీలకు వణుకు పుట్టించేలా చీలికలు మొదలయ్యాయి. దీంతో లోక్‌సభలో, రాజ్యసభలో సంపూర్ణ మెజార్టీ కోసం యత్నాలు మొదలయ్యాయని భావించాలి. తమిళనాడులో కూడా డిఎంకె పరోక్షంగా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న ఆ పార్టీ,ఇండి కూటమితో కలసి వెళ్లకపోవచ్చు. మొత్తంగా రానున్న రోజుల్లో ఈ ముఖచిత్రం మరింత స్పష్టంగా ఆవిష్కృతం కానుంది.

# వణికిస్తున్న బాస్..




**కొత్త స్కామ్‌తో కంపెనీలకు ముప్పు**

- సీఈవోల పేర్లతో ఉద్యోగులను బురిడీ కొడుతున్న సైబర్ కేటుగాళ్లు
- వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా మాల్‌వేర్ దాడులు
- కంపెనీ ఖాతాల నుంచి కోట్ల రూపాయలు కాజేస్తున్న నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని ఐ4సీ హెచ్చరిక

**న్యూఢిల్లీ, జూన్ 23:** సైబర్ నేరగాళ్లు రోజు రోజుకూ కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడు తున్నారు. వ్యక్తిగత ఖాతాలను లక్ష్యంగా చేసుకునే మోసాలకు తోడు ఇప్పుడు పెద్ద కంపెనీలనే టార్గెట్ చేస్తున్నారు. 'బాస్ స్కామ్' పేరుతో జరుగుతున్న ఈ కొత్త తరహా మోసా ల్లో కంపెనీల సీఈవోలు, ఉన్నతాధికారుల పేర్లను ఉపయోగించి ఉద్యోగులను మభ్యపెట్టి భారీ మొత్తాలను కాజేస్తున్నారు. ఈ తరహా మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) హెచ్చరికలు జారీ చేసింది. సాధారణంగా కంపెనీల్లోని కీలక అధికారులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ముందుగా వల వేస్తారు. ఆర్‌బీఐ వంటి ప్రభుత్వ సంస్థల పేర్లతో వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా సందేశాలు పంపిస్తారు. ఆ సందేశాల్లో ఉండే జిప్ ఫైల్‌ను తెరిచిన వెంటనే మాల్‌వేర్ సిస్టమ్‌లోకి ప్రవేశిస్తుంది.

### అధికారిక కమ్యూనికేషన్లపై నిఘా

మాల్‌వేర్ ద్వారా నేరగాళ్లు వాట్సాప్ వెబ్ సెషన్లను హ్యాక్ చేసి కంపెనీ అంతర్గత సమా చారాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటారు. అధికారులు, ఉద్యోగుల మధ్య జరిగే కమ్యూనికేషన్‌ను గమనిస్తూ సరైన అవకాశాన్ని ఎదు రు చూస్తారు. ఆ తర్వాత సీఈవో లేదా ఉన్నతాధికారుల అధికారిక నంబర్ల నుంచే ఫైనాన్స్ విభాగానికి అత్యవసరంగా డబ్బులు బదిలీ చేయాలంటూ సందేశాలు పంపిస్తారు. ఆదేశాలు నిజమని భావించిన సిబ్బంది పెద్ద మొత్తాలను బదిలీ చేయడంతో కంపెనీలు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయి. సైబర్ నిపుణు ల సూచనల ప్రకారం, డబ్బులు పంపాలని లేదా ఖాతా వివరాలు మార్చాలని పై అధికారు ల పేరుతో సందేశం వస్తే తప్పనిసరిగా నేరుగా ఫోన్ చేసి ధృవీకరించుకోవాలి. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫైల్స్, అటాచ్‌మెంట్లను తెరవకూడదు. ప్రభుత్వ సంస్థలు వాట్సాప్ ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు పంపవని గుర్తుంచు కోవాలి. అలాగే వాట్సాప్‌లో అనుమానా స్పదంగా ఇతర పరికరాలు అనుసంధానమై ఉన్నాయేమో తరచూ తనిఖీ చేయాలి. కంప్యూటర్లు, మొబైల్ పరికరాల్లో తాజా యాంటీ మాల్‌వేర్ భద్రతా వ్యవస్థలను ఉపయోగించడం ద్వారా ఇటువంటి మోసాల నుంచి రక్షణ పొందవచ్చని ఐ4సీ సూచించింది.

# హర్మూజ్‌పై పట్టు కోసం ఇరాన్ బెట్టు

## అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్

**టెహ్రాన్, జూన్ 23:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హర్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.






# అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

## ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన

**వాషింగ్టన్, జూన్ 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

# మేము లేకుండా యూఎస్ చంద్రుణ్ణి చేరుకోలేదు: జర్మనీ మంత్రి

**బెర్లిన్/పారిస్:** ఏఐ సంస్థ ఆంథ్రోపిక్‌కు చెందిన అత్యాధునిక ఏఐ మోడల్స్ ఇతర దేశాలకు అందకుండా అమెరికా ప్రభుత్వం నిషేధించడంపై ఐరోపాలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఏఐ రంగంలో సార్వభౌమత్వం సాధించాలన్న డిమాండ్స్ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జర్మనీ అంతరిక్ష పరిశోధన శాఖ మంత్రి డొరొతీ బార్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అంతరిక్ష ప్రయోగాలకు ఐరోపా, జర్మనీ అందించే సాంకేతికతలు కీలకమని గుర్తు చేశారు. 'మేము లేకపోతే నాసా స్పేస్ మిషన్లు సాధ్యం కాదు. ఐరోపా సర్వీస్ మాడ్యుల్ లేకుండా నాసా చంద్రుడిని చేరలేదు' అని ఇటీవల వీవాటెక్ ట్రేడ్ షో సందర్భంగా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. అంతరిక్ష రంగంలో ఆధిపత్యం కోసం మరో కూటమి కూడా ఏర్పాటైందని మంత్రి డొరొతీ పేర్కొన్నారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా, ఇరాన్ దేశాలు అంతరిక్ష రంగంలో ఐరోపాను అధిగమించకూడదని స్పష్టం చేశారు. అమెరికా టెక్నాలజీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఐరోపా సమాఖ్య భావిస్తోంది. సెమీ కండక్టర్లు మొదలు, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వరకూ వివిధ రంగాల్లో స్వదేశీ సంస్థల అభివృద్ధిపై దృష్టిసారించింది. ఇందుకోసం ఒక వ్యూహాన్ని కూడా రూపొందించుకుంది. ఆర్థికంగా, రాజకీయంగా తాము కోల్పోయిన ప్రాభవాన్ని మళ్లీ దక్కించుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఐరోపా, అమెరికా మధ్య విభేదాలు పెరిగితే అధ్యక్షుడు ట్రంప్ క్రిటికల్ సాంకేతికతలపై నిషేధం విధించవచ్చని ఐరోపాలో ఎప్పటినుంచో భయాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా ఆంథ్రోపిక్ ఏఐ మోడల్స్‌పై యూఎస్ నిషేధంతో ఐరోపా అప్రమత్తమైంది.




# పాక్, ఖతార్‌ను నమ్మలేం

- ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది
- బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది
- జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు



**వాషింగ్టన్, జూన్ 23:** పాకిస్థాన్‌పై ప్రేమను వ్యక్తం చేస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అమెరికాకు చెందిన ఇద్దరు సెనేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ దేశ ఉగ్రచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, బిన్ లాడెన్‌ను దాచిన ఘనత పాక్‌దని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, ఖతార్ దేశాలపై అమెరికాకు చెందిన ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు రిక్ స్కాట్, టిమ్ షీహీ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర ఆ దేశాలకు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాగా, అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై స్విట్జర్లాండ్‌లో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్, ఖతార్ నాయకులతో వాన్స్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మేము పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నాం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్, ఖతార్‌లను నిష్పక్షపాత మధ్యవర్తులుగా చూడకూడదని సెనేటర్ రిక్ స్కాట్ తేల్చి చెప్పారు. మధ్యప్రాచ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలే వాషింగ్టన్‌కు నిజమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. ఆ దేశాలనూ అమెరికా చర్చల్లో చేర్చుకోవాలని స్కాట్ సూచించారు. 'మన నిజమైన స్నేహితులు ఎవరో ఇప్పటికే అందరికీ స్పష్టంగా తెలిసి ఉండాలి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన సుదీర్ఘ చరిత్ర ఖతార్, పాకిస్థాన్‌లకు ఉంది. ప్రస్తుతం వారు అర్థవంతమైన శాంతిని సాధించడం కంటే ఇరాన్ దశాబ్దాల నాటి ఉగ్రవాద ప్రచారాన్ని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. అందరికీ ప్రయోజనం చేకూర్చే ఆచరణీయమైన ఒప్పందానికి ఇంకా ఆస్కారం ఉంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మోంటానా సెనేటర్ టిమ్ షీహీ కూడా పాకిస్థాన్‌ను విమర్శించారు. 'పాకిస్థాన్ ఒక దశాబ్దం పాటు బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పాకిస్థానీలు ఐఎస్ఐ ద్వారా మాపై పోరాడే వారికి నిధులు సమకూర్చారు. ముఖ్యంగా అయతుల్లాకు నిధులు అందించారు. ఖతార్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థలకు మనీలాండరింగ్ ద్వారా డబ్బును అందిస్తోంది. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ శాంతి ఒప్పందంలో పాకిస్థాన్, ఖతార్‌లు పాల్గొంటే.. ఆ చర్చల్లో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలనూ చేర్చుకోవాలి. మధ్యప్రాచ్యంలో ఆ మూడు దేశాలే అమెరికాకు నిజమైన మిత్రదేశాలు' అని పేర్కొన్నారు. కాగా, వీరి వ్యాఖ్యలు ఇప్పటికే ఉన్న వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది.

## గానుగాపూర్ సహా నాలుగు పుణ్యక్షేత్రాలకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక యాత్ర

**పటాన్చెరు, జూన్ 23 :**

టీజీఎస్ఆర్టీసీ బీహెచ్ఈఎల్ డిపో ఆధ్వర్యంలో గానుగాపూర్, కొల్హాపూర్, పండరిపూర్, తుల్జాపూర్ పుణ్యక్షేత్రాల దర్శనానికి ఈ నెల 26వ తేదీ (శుక్రవారం) ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వి. మోహన్‌రావు తెలిపారు.ఈ యాత్ర శుక్రవారం రాత్రి 9 గంటలకు కేపీహెచ్‌బీ నుంచి ప్రారంభమవుతుంది. శనివారం ఉదయం గానుగాపూర్ చేరుకుని స్నానాలు, దర్శనం అనంతరం కొల్హాపూర్‌కు బయలుదేరుతారు. అక్కడ దర్శనం అనంతరం పండరిపూర్ చేరుకుని రాత్రి బస ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం పండరిపూర్‌లో స్నానాలు, దర్శనం అనంతరం తుల్జాపూర్‌కు వెళ్లి అమ్మవారి దర్శనం, భోజనం ముగించుకుని సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం ప్రారంభిస్తారు. ఆదివారం రాత్రి 11 గంటల వరకు హైదరాబాద్ చేరుకునేలా యాత్ర ప్రణాళిక రూపొందించారు.ఈ యాత్రకు రాను–పోను టికెట్ ధర రూ.3,280గా నిర్ణయించారు. భోజనాలు, వసతి ఖర్చులు యాత్రికులే భరించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.ఆర్సీ పురం, పటాన్‌చెరు, బీరంగూడ, అశోక్‌నగర్, లింగంపల్లి, మదీనాగూడ, మియాపూర్, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో బోర్డింగ్ సౌకర్యం కల్పించారు.ఆన్‌లైన్ బుకింగ్ కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. OPRS నంబర్: 97714. మరిన్ని వివరాలకు 7382814249, 9063401072, 9063400960, 8500309052 నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.పరిసర ప్రాంతాల భక్తులు ఈ ప్రత్యేక పుణ్యక్షేత్ర యాత్రను సద్వినియోగం చేసుకోవాలని బీహెచ్ఈఎల్ డిపో మేనేజర్ వి. మోహన్‌రావు కోరారు.




## ఎస్సార్ నాయక్ నగర్ లో పర్యటించిన కొంపల్లి డిప్యూటీ కమిషనర్ లావణ్య

- పార్కులను అభివృద్ధి చేయాలని డిప్యూటీ కమిషనర్ ని కోరిన గుబ్బల లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు ఆలూరి వెంకట శేషాచారి..



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 23 :**

మంగళవారం ఎస్సార్ నాయక్ నగర్ లో కొంపల్లి డిప్యూటీ కమిషనర్ లావణ్య పర్యటించిన నేపథ్యంలో స్థానిక శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని అలాగే గతంలో పార్కులను అభివృద్ధి చేయాలని జోనల్ కమిషనర్ కి డిప్యూటీ కమిషనర్ కి విజ్ఞప్తి చేయగా మంగళవారం వచ్చి పరిశీలించిన సిఎంసీ కమిషనర్ సృజన దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తానని పార్క్ డెవలప్మెంట్ అధికారులతో కూడా మాట్లాడతానని హామీ ఇచ్చారు. పెండింగ్లో ఉన్న పలు సమస్యలు వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఎస్సార్ నాయక్ నగర్ మాజీ అధ్యక్షులు లు ఆలూరి వెంకట శేషాచారి, బొబ్బ ప్రసాద్, సీనియర్ నాయకుడు పివి భాస్కర్ రెడ్డి, శానిటేషన్ డి ఈ తిరుపతి, ఎస్ఎఫ్ఐలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ ఘర్ నిర్మాణ పనులపై చైర్మన్ సమీక్ష



**దుబ్బాక జిల్లా ప్రతినిధి, జూన్ 23 :**

తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ జనాబ్ తాహెర్ బిన్ హమ్దాన్ దుబ్బాకలో నిర్మాణంలో ఉన్న ఉర్దూ ఘర్-కమ్-షాదీ ఖానా భవనాన్ని మంగళవారం సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, మిగిలి ఉన్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఈ సదుపాయం త్వరగా అందుబాటులోకి వచ్చేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి నాగరాజమ్మ, సిద్దిపేటతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎల్నినో ప్రభావం నేపథ్యంలో పంటల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలి

**జిల్లా కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 23 :**

జిల్లాలో ఎల్నినో ప్రభావం ప్రారంభమైన నేపథ్యంలో రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి సూచించారు. నీటి వనరులు సమృద్ధిగా ఉన్న రైతులు సన్న వడ్ల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో పప్పుధాన్యాలు, నూనెగింజలు, మిల్లెట్స్, కూరగాయల పంటలను సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని పొన్నాల రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు జూన్ 23 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు వేదికల్లో విత్తన మేళాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. భారత వాతావరణ శాఖ ఎల్నినో ప్రభావంపై హెచ్చరికలు జారీ చేసిందని, దీని కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉందన్నారు. వరి సాగు చేసే రైతులు నీటి లభ్యతను బట్టి ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో కంది, మినుము, పెసర, నూనెగింజలు, మిల్లెట్స్, కూరగాయల సాగు లాభదాయకమని తెలిపారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో నారుమడులు కూడా వేయలేని పరిస్థితి ఉన్నందున రైతులు తమ వద్ద ఉన్న వనరులు, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేసే లక్ష్యంతో విత్తనాలను అందుబాటులో ఉంచిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్లస్టర్ పరిధిలోని రైతు చిన్ని శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు. 10 ఎకరాల్లో రసాయనాలు ఉపయోగించకుండా సంప్రదాయ పద్ధతిలో సాగు చేస్తున్న అరటి, బొప్పాయి, కోకో, మునగ తోటలను పరిశీలించారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, సూక్ష్మ నీటి సరఫరా పద్ధతుల గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. సంప్రదాయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి, ఏఈఓ మీరా, సర్పంచులు అమ్ములు వెంకటయ్య, మౌనిక నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సృజన సంపత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేట జిల్లాలో దారుణ హత్య

- తిమ్మాపూర్ లో యువకుడిని గొడ్డలితో నరికివేత

**దుబ్బాక, జూన్ 23 :**

సిద్దిపేట జిల్లాలో దారుణ హత్య జరిగిన ఘటన వెలుగు చూసింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని తిమ్మాపూర్ లో ఓ యువకుడిని దారుణంగా హత్య చేయడమే కాకుండా ఆ వెంటనే మృతుడి తమ్ముడికి ఫోన్ చేసి మరీ మ్యాటర్ చెప్పి పరారయ్యాడు నిందితుడు. గ్రామస్తులు దుబ్బాక పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో సోమవారం ఉదయం యువకుడి దారుణ హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తి, రమేష్(30) అనే యువకుడిపై ఘాతుకానికి ఒడిగట్టాడు. ఎవరూ లేని సమయం చూసి, యువకుడిపై గొడ్డలితో తీవ్రంగా దాడి చేసి ప్రాణాలు తీశాడు. అయితే ఈ హత్య చేసిన తర్వాత నిందితుడు ప్రవర్తించిన తీరు పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. హత్య చేసిన వెంటనే నిందితుడు ఏమాత్రం కంగారు పడకుండా, మృతుడి సొంత తమ్ముడికి ఫోన్ చేసి చెరువు కట్ట సమీపంలో ఒకడిని హత్య చేశాను" అని కూల్‌గా చెప్పి, వెంటనే ఫోన్ కట్ చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడి మాటలకు కంగుతిన్న తమ్ముడు, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. దుబ్బాక పోలీసులు వెంటనే తిమ్మాపూర్ శివారుకు చేరుకున్నారు. సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అనంతరం రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దుబ్బాక పోలీసులు, నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.





## ఇక్రిసాట్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**అమీన్పూర్, జూన్ 23 :**

బీరంగూడ డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ ఫేజ్-1 కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించి, నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు.మంగళవారం వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే, స్థానికులతో సమావేశమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, నూతన డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ పైప్‌లైన్, మంచినీటి పైపుల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే నెల రోజుల్లోగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ అంశాన్ని కూడా పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఈఈ సురేష్, జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీఈ వెంకటరమణ, డీజీఎం శివకుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



## విద్యార్థులపై ప్రేమ ఉంటే రాజకీయాలు కాదు, వారి సమస్యలపై పోరాడాలి

- తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 23 :**

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు అందలేదనే కారణంతో ఏబీవీపీ మంగళవారం బంద్‌కు పిలుపునివ్వడం విచారకరం. విద్యార్థుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన నీట్ పేపర్ లీక్ ఘటనపై ఎందుకు నోరు మెదపలేదు. విద్యార్థులు ఆందోళనకు గురైనప్పుడు, ఎన్ టి ఏ వైఫల్యాల వల్ల వారి కలలు చిద్రమైనప్పుడు ఏబీవీపీ నాయకులు ఎక్కడ ఉన్నారు. ఎందుకు ఎన్ టి ఏ ను రద్దు చేయాలని డిమాండ్ చేయలేదు. ఎందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించలేదు. తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ తరపున మేము స్పష్టంగా చెబుతున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆధునిక సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది. విద్యార్థుల సంక్షేమం మరియు విద్యాభివృద్ధే మా ప్రధాన లక్ష్యం. ఏబీవీపీ నాయకులు నిజంగా విద్యార్థుల పక్షాన ఉంటే, ప్రతి సంవత్సరం జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. అనవసర రాజకీయ డ్రామాలకు బదులుగా విద్యార్థుల హక్కుల కోసం కలిసి పోరాడాలి. విద్యార్థుల ప్రయోజనాల కోసం ఎన్ ఎస్ యు ఐ ఎప్పటికీ ముందుంటుందని తెలిపారు.



## రిపోర్టర్ నర్సింలు ను పరామర్శించిన గోలి సంతోష్ గుప్తా

- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న నర్సింలు కుటుంబ సభ్యులు



**గజ్వేల్ టౌన్, జూన్ 23 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బంగ్లా వెంకటపూర్ గ్రామానికి చెందిన రిపోర్టర్ నర్సింలు రెండవ కుమార్తె రాగిని ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించగా మంగళవారం రిపోర్టర్ నర్సింలు ను బిఆర్ఎస్ నేత సీనియర్ నాయకుడు, ఫర్టిలైజర్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గోలి సంతోష్, నర్సింలు ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, చిన్నారి రాగిని మరణం బాధాకరం అని క్షణిక ఆవేశంలో ఆత్మహత్య చేసుకోవడం తల్లి తండ్రులకు శోకం తప్ప ఏమి లేదని, యువతి యువకులు చదువు మీద దృష్టి పెట్టి,ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అన్నారు. నర్సింలు కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిసిన అయోధ్య నగర్ కాలనీ నూతన అధ్యక్షులు జోయెల్..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 23 :**

మంగళవారం 132 – అయోధ్య నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికల్లో గెలిచిన జోయెల్ (బాబీ) కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధిలో యువతరం ముందున్నప్పుడే కాలనీ అభివృద్ధి సాధ్యమని అన్నారు. నిరుపేదలు అధికంగా జీవించే అయోధ్య నగర్ కాలనీలో కాలనీ అభివృద్ధిలో నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అయోధ్య నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



చురకలు



# ప్రభుత్వ పాఠశాలల కుదింపు ఆలోచనను విరమించుకోవాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విజయేందర్ రెడ్డి




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 23 :** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) సిద్దిపేట జిల్లా శాఖ సమావేశం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విజయేందర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాడిపల్లి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కుదించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్య అందరికీ చేరాలంటే ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల కొనసాగాలని, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అధిక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి డి రాజయ్య మాట్లాడుతూ 2023 జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్‌సీని ఇప్పటి వరకు అమలు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులకు పూర్తి విధివిధానాలు రూపొందించకుండానే ఉద్యోగుల వేతనాల నుంచి కోతలు విధించడం సరికాదని అన్నారు. ఉపాధ్యాయుల అనుమతి లేకుండా వేతనాల నుంచి కోతలు విధించడం ప్రభుత్వానికి తగదని విమర్శించారు. సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. అలాగే సిద్దిపేట జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్య నష్టపోతుందని, వెంటనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నరేందర్, జిల్లా కమిటీ సభ్యులు ఏ సత్యనారాయణ, రామ్‌రెడ్డి, పాపిరెడ్డి, సత్యకృష్ణ, నర్సింహారెడ్డి, శివాజీ, అజీజ్, మల్లేశం, శ్రీనివాస్, రాములు, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ కి నివాళులు అర్పించిన గజ్వేల్ బీజేపీ నాయకులు

**గజ్వేల్ టౌన్, జూన్ 23 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ ఆధ్వర్యంలో ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా అనే లక్ష్యంతో కాశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రాతఃస్మరణీయులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా మంగళవారం ఘన నివాళులు అర్పించిన గజ్వేల్ బీజేపీ నాయకులు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ లు మాట్లాడుతూ సాంస్కృతిక, ఆర్థిక జాతీయవాదమే పునాదిగా, భారతీయ సనాతన ధర్మరక్షణే ధ్యేయంగా, భారతీయ జన సంఘ్ ను స్థాపించిన మార్గదర్శి అఖండ భారతమే ఆదర్శంగా దేశ ప్రజల సంఘటితమే సిద్ధాంతంగా పనిచేసిన కర్మశీలి, ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహి చలేగా అని నినదించిన ధైర్యశాలి, పటిష్ట జాతీయ భావజాల నిర్మాణమే పరమావధిగా తన జీవితాంతం హైందవ సాంస్కృతిక వికాసం కోసమే కృషి చేసిన నిత్యచైతన్యశీలి డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఆ మహనీయునికి వినమ్ర శ్రద్ధాంజలి ఘటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, 4వ వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, జిల్లా నాయకులు నత్తి శివకుమార్, కోదండం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకట్ రెడ్డి,



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్, మండల ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్ కుమార్, మదుగురి నరసింహ ముదిరాజ్, బారు అరవింద్, బీజేపీ పట్టణ కార్యదర్శి చిక్కుడు ప్రసాద్, కేతవత్ ఆంజనేయులు, రాజేశ్వర్ చారి, తిప్పతి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన ధాన్యం కొనుగోళ్లు.. పెరిగిన పంట దిగుబడి..

- నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

**నంగునూరు, జూన్ 23 :** నంగునూరు మండలంలో అన్ని గ్రామాల్లోని వడ్ల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు ఘనంగా ముగిసాయని నంగునూరు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం నంగునూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో మొత్తం 6190 మంది రైతుల నుండి, 2,74,453 మెట్రిక్ క్వింటళ్ల రికార్డ్ ధాన్యాన్ని కొనుగులు చేశామని తెలిపారు. పోయిన రబీ సీజన్లో




1,94,161మెట్రిక్ క్వింటాల్ వడ్లు కొనుగోలు చెస్తే ఇప్పుడు 2,74,453, మెట్రిక్ క్వింటాళ్ల వడ్లు సేకరించి, పోయిన సారి కంటే ఈసారి అత్యధికముగా 80,292 మెట్రిక్ క్వింటాల్ వడ్లు అధికంగా సేకరించామని పేర్కొన్నారు. ఈ కొనుగోళ్లలో తహసీల్దార్ ప్రవీణ్ రెడ్డి, ఆర్ఐ లింగం యాదవ్, ఏపీఎం శ్రీనివాస్, పాక్స్ కార్యదర్శులు రాజి రెడ్డి, రాజేందర్, వారి సిబ్బంది, మార్కెట్ కమిటీ సిబ్బంది, ముఖ్యంగా హమాలీ కార్మికుల సహకారంతో కొనుగోలు విజయ వంతంగా పూర్తి చేశామని వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇంత పెద్దమొత్తంలో వడ్ల కొనుగోలు చేసి తక్షణమే రైతులకు డబ్బులు కూడా చెల్లించిన ఘనత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు.

# మట్టి రోడ్లు లేని గ్రామాలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి

- దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి
- సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**తొగుట, జూన్ 23 :** దుబ్బాక నియోజకవర్గంలో అన్ని గ్రామాలను మట్టి రోడ్లు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు, ఆయా గ్రామాలలో సీసీ రోడ్లను, నిర్మిస్తున్నామని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తొగుట మండలంలోని వెంకట్రావుపేటలో సీఆర్ఆర్ రూ.20 లక్షలు, తొగుట గ్రామంలో సీఆర్ఆర్ రూ.10 లక్షలు, మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీస్కీం రూ. 5 లక్షలు, కాన్గల్ గ్రామంలో సీఆర్ఆర్ రూ.10 లక్షలు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రూ.5 లక్షల నిధులతో మంజూరైన రూ.50 లక్షల నిధులతో మంగళవారం సీసీ రోడ్డు పనులను ఆయా గ్రామాలలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి రోడ్డు లేని పల్లెలుగా తీర్చిదిద్దడమే మా కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, సర్పంచ్లు బండారు కవిత, పాగాల శోభా కొండల్ రెడ్డి, రాంపురం రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జీడిపల్లి స్వామి, పిట్ల బిక్షపతి,



ఆత్మ కమిటీ డైరెక్టర్ బెజ్జనబోయిన ప్రవీణ్, ఉప సర్పంచ్ బండారు తిరుపతి, గ్రామ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, బషీర్, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి, పంది రాజు, మల్లారెడ్డి, కొండల్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వడ్డే కిష్టయ్య, చరణ్, షఫీ, వార్డ్ సభ్యులు భాను, నాయకులు పోతరాజు రవీందర్, నర్సింలు, అర్జున్, భాస్కర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 19 షాపులకు లాటరీ ద్వారా పంచాయతీ స్థలం కేటాయింపు

**దమ్మపేట, జూన్ 23 :** దమ్మపేట గ్రామ పంచాయతీకి చెందిన పంచాయతీ స్థలంలో షాపులు పెట్టుకునేందుకు ప్రధాన రహదారి డ్రైన్లు పై వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులకు పంచాయతీ పాలకవర్గం ప్రాధాన్యత ఇస్తూ మంగళవారం దమ్మపేట గ్రామపం చాయతీ కార్యాలయంలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ఆధ్వర్యంలో అర్హత గల పేర్లను చదివి అద్దె వివరాలు తెలియచేయగా అద్దె అధిక మొత్తం అనే అభ్యంతరం తో స్పందించిన పాలకవర్గం అప్పటికప్పుడు గ్రామస్తుల సూచనల మేరకు ప్రతీ షాప్ పై ₹1000/- తగ్గించారు. తదనంతరం అందరి సమక్షంలో లాటరీ తీసి షాపు స్థలాలను కేటాయించారు. ప్రధాన రహదారి వెంబడి గల ఆరు షాపులకు ₹4000/- అద్దెతో కోనేటి గోపాలచారి, తోట మల్లేశ్వరరావు, ఎన్ శేషమ్మ, వై.మహేశ్వరి మిడత హేమ మారంగి, మధ్యలో గల ₹3000/- అద్దెతో షాపులను గవర నాగేంద్రరావు, రంగు గాంధీ, వీరంకి



రమణ, జి వెంకటరత్నం, తుపాకుల లక్ష్మి, కట్టా ప్రసాద్, దర్శి ఫణి, భూక్యా రాజు వెనక గల ₹2000/- అద్దెతో షాపులను చిన్నశెట్టి , మట్టా మధు, వానరాశి వెంకన్న, సదా శ్రీనివాసు, చిల్లపల్లి చంద్ర అను వారికి స్థలం కేటాయించిన కార్యదర్శి బండి అనంత్ కుమార్ మాట్లాడుతూ డిపాజిట్ నిమిత్తం షాప్ కి ఐదు వేలు చొప్పున పంచాయతీకి చెల్లించాలి అని. మొదటి నెల షాప్ అద్దె మినహాయింపు ఉంటుంది అని, పంచాయతీ తరపున ప్రతీ షాప్ కి కరెంట్ కనెక్షన్ వచ్చేలా చేసి, ఇట్టి వాణిజ్య సముదాయంకి మంచి నీటి పంపు వసతి కల్పిస్తాం అన్నారు. ఇట్టి షాప్ నిర్మాణాల వలన ఒకరికి ఒకరు ఇబ్బంది పడకుండా బేస్మెంట్ కూడా ఒకే లెవెల్ లో కట్టుకోవాలి అని, ఇట్టి షాపు లలో మద్యం, మాంసం, పేలుడు పదార్థాల నిల్వలు నిర్వహించే వారికి అనుమతి లేదు అన్నారు, షాప్ నిర్వహించే వారితో 4 సం.లకు అగ్రిమెంట్ ఉంటది అని తదనంతరం రెన్యువల్ అవకాశం కల్పిస్తాం అన్నారు. ప్రతీ షాప్ స్థలం పొడవు వెడల్పు కొలతలు తెలియజేశారు. ఈ షాపుల ద్వారా వచ్చే ఆదాయంతో స్వయం సమృద్ధి సాధించి పంచాయతీ మరింత అభివృద్ధికి చెందటానికి దోహద పడుతుంది అన్నారు. లాటరీలో షాపు స్థలాలు వచ్చినవారికి త్వరగా షాప్ లు నెలకొల్పి మంచి ఆదాయం వచ్చేలా వ్యాపార అభివృద్ధి జరగాలని గ్రామస్తులు చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు ఆకాంక్ష తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, చాట్ల శ్రీను, పసుమర్తి కుసుమాంబ, దాసరోజు సరిత రామారావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, గ్రామస్తులు షేక్ రహీం, చిన్నశెట్టి గోపి, పిట్టల శ్రీనివాసరావు, గట్ల నాగరాజు, జెట్టి వెంకటేశ్వరరావు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విలేకరి నర్సింలు కుటుంబాన్ని పరామర్శించిన నేతలు



**గజ్వేల్ టౌన్, జూన్ 23 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బంగ్లా వేంకటపూర్ పత్రికా విలేకరి బాకీ నర్సింలు కుమార్తె అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తమైంది. మొన్నటి రోజున ఆమె మరణించిన సంగతి తెలిసి, మంగళవారం పలువురు ప్రముఖులు వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, పంజాల కుమార్ గౌడ్, బారు అరవింద్, సల్లూరి మహేందర్ శోకసప్తప్త కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. వారికి ధైర్యం చెప్పి, ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని కోరుతూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# దమ్మపేట శ్రీ గాయత్రి ఆశ్రమం 25 వ వార్షికోత్సవ వేడుకలు




**దమ్మపేట, జూన్ 23 :** దమ్మపేట మండల కేంద్రంలో గల శ్రీ గాయత్రి ఆశ్రమం 25 వ సిల్వర్ జూబ్లీ వేడుకలలో మొదటి రోజు మంగళవారం ఉదయం 5 గంటల నుండి అమ్మ వారికి అభిషేకం, దుప్ హారతి, సహస్ర నామ కుంకుమ అర్చన, త్రికుండీ గాయత్రి యజ్ఞం లను వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురూజీ దంపతులు భక్తులతో ఉచితంగా చేయించారు, తదుపరి దమ్మపేట, కొత్తగూడెం కు చెందిన హనుమాన్ భక్తులచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి భక్తులకు అన్నదానము చేశారు. బుధవారం 25 వ వార్షికోత్సవ వేడుకలలో గాయత్రి జయంతి సందర్భంగా అమ్మ వారికి విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నా అమృత సేవ ఉంటుంది అని తెలియజేశారు, లోక కళ్యాణములు కొరకు చేసే ఈ కార్యక్రమంలో పాల్గొనాలి అని ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురూజీ భక్తులకు తెలియజేశారు.

# కొండగట్టు అంజన్న సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్..



**చొప్పదండి ప్రతినిధి, జూన్ 23 :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి స్వామిని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయానికి చేరుకోగానే ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. అంజనారెడ్డి పూలమాల వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వస్తి వేదమంత్రాలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి పుల్లా కార్తీక్



**చొప్పదండి ప్రతినిధి, జూన్ 23 :** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంను హైకోర్టు న్యాయమూర్తి పుల్లా కార్తీక్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జస్టిస్ పుల్లా కార్తీక్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు స్వస్తి వేదమంత్రాలతో స్వాగతం పలికి, స్వామివారి దర్శనానికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను జస్టిస్ పుల్లా కార్తీక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అంజనా రెడ్డి, ఎస్సై సందీప్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చురకలు

బుధవారం 24 జూన్ 2026

## రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్

- **రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే..**

**జగిత్యాల ప్రతినిధి, జూన్ 23 :**

జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు కార్యక్రమంలో పాల్గొని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని జగిత్యాల రైతుల పక్షాన వ్యవసాయం, సన్న వడ్ల సాగుపై సూచనలు,సలహాలు తెలిపి అనంతరం రైతులకు 100 శాతం సబ్సిడీపై కంది చిరు సంచులను, విత్తనాలు పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో ఆత్మా చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, సర్పంచులు గోడిసెల గంగాధర్, సంగేపు మహేష్, సైంటిస్ట్ విజయ్ భాస్కర్, మాజీ ఏఎంసి చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, పెండెం రాములు, బాల ముకుందం, ఉప సర్పంచ్ గంగాధర్, ఏడిఏ తిరుపతి నాయక్, ఏఓ వినీల, ఏఈఓ నాగరాజు, మంజుల, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి, సురేష్, సతీష్, శంకర్, గంగారెడ్డి, నారాయణ, మల్లేశం, పంబాల రాము, శ్రీదర్, మహేష్, శరత్ రావు, ప్రవీణ్ రావు, సాయి, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాలకి పై అవగాహన



- **పిల్లలు చిన్న వయస్సు నుండే మాదక ద్రవ్యాలకి బానిసలు అవ్వడం బాధాకరం - జడ్జి భవాని**

**దమ్మపేట, జూన్ 23 :**

దమ్మపేట మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో దమ్మపేట ఏపీఆర్జేసీ కళాశాల నందు మంగళవారం దమ్మపేట జడ్జి బి భవాని ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి భవాని మాట్లాడుతూ పిల్లలు చిన్న వయస్సు నుంచే మాదక ద్రవ్యాలకి అలవాట్లు పడి వారి ఆరోగ్యాలను మరియు ఆర్థిక స్థితిగతులను నష్టపోతున్నారని దానివలన జరిగే చెడు పరిణామాలు, చట్టపరంగా జరిగే శిక్షల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు గొంది మురళీమోహన్, జనరల్ సెక్రెటరీ లక్కీనేని నరేంద్రబాబు మరియు న్యాయవాదులు నల్లపు ఉదయ్ కుమార్, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, టి అరుణ కుమారి, కాలం సంధ్యారాణి మరియు కాలేజీ ప్రిన్సిపల్, సి.ఐ నాగరాజు, ఎస్సై రాజేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్నూర పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డీఐజీ

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23:**




చార్మినార్ జోన్ –7 ఎల్ఎస్ చవాన్ మంగళవారం పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యాకర్స్, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూ చించారు. మారుతున్న సమాజ అవస రాలకు అనుగుణంగా సిసిటి ఎన్ఎస్–2.0 ను అమలు చేయాలని తెలిపారు. పోలీసులు అనునిత్యం పర్యవేక్షణలో ఉండాలని ఆయన సూచించారు.

## విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల కలెక్టరేట్, జూన్ 23 :**




జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ బీ.ఎస్.లత అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ యాక్ట్ అమలుపై జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నితిన్, జిల్లా వైద్యాధికారిణి జి. సుజాత, ఆర్డిఓ మధుసూదన్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్, డిఎస్పీ పురుషోత్తం, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టివి సూర్యం, తుమ్మల గంగారం, నక్క అశోక్, బొల్లి కిషన్, వేణు, మానిటరింగ్ కమిటీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం, బీరంగూడలో ఘనంగా డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ నిర్వహణ

**పటాన్చెరు, జూన్ 23 :**

సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం, బీరంగూడలో డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ను భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, దేశ సమైక్యత కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.రామచంద్రపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సమగ్రత, అఖండత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదనే నినాదంతో కాశ్మీర్ సంపూర్ణ విలీనం కోసం చివరి శ్వాస వరకు




పోరాడిన వీరుడు ముఖర్జీ అని పేర్కొన్నారు. ఆయన త్యాగ ఫలితంగానే ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ను రద్దు చేసి ఆయన ఆశయాలను సాకారం చేసిందని అన్నారు. నేటి యువతకు ముఖర్జీ దేశభక్తి, త్యాగం ఆదర్శప్రాయమని తెలిపారు.బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలనే పరమావధిగా భావించి జీవించిన మహనీయుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశ బలోపేతానికి ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.బీరంగూడలో అమీన్పూర్ పట్టణ బీజేపీ కన్వీనర్ ఆగరెడ్డి ఆధ్వర్యంలో బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్ పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అడెల్లి రవీందర్ మాట్లాడుతూ, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మహోన్నత వ్యక్తిత్వం కలిగిన నాయకుడని అన్నారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి భారతీయ జనతా పార్టీ విస్తరణకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి రమేశ్ రెడ్డి, శ్రవణ్, లక్ష్మణ్ గుప్తా, ఎడ్ల జనార్దన్, కిరణ్ రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- **ఆర్టీసీ రెవెన్యూ పెంచే విధంగా ప్రజలు సహకరించాలి..**
- **ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11రూట్లలో ఆర్టీసీ సర్వీసులు..**
- **ధర్మపురి నుంచి నూతన బస్సు సర్వీసులను ప్రారంభించిన మంత్రి అడ్లూరి..**

**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, జూన్ 23 :**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు నిచ్చారు. ధర్మపురికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ధర్మపురి నుంచి నిర్మల్, కరీంనగర్ కు రెండు కొత్త బస్సు సర్వీసులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ధర్మపురి బస్టాండ్ లో ప్రారంభించారు.

**ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ**

ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ధర్మపురి శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయానికి నిత్యం వేల మంది భక్తులు వస్తుంటారని అన్నారు. భక్తుల సౌకర్యం కోసం నిర్మల్ నుంచి ధర్మపురి వరకు ఎక్స్ ప్రెస్ బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని మంత్రి అన్నారు. ఉదయం 7 గంటలకు నిర్మల్ నుంచి దస్తురాబాద్, కడెం, ఖానాపూర్ మీదుగా ధర్మపురి వస్తుందని మంత్రి వివరించారు. రోజుకు రెండు ట్రిపుల చొప్పున నిర్మల్ – ధర్మపురి మధ్య బస్సు నడుస్తుందని మంత్రి అడ్లూరి తెలిపారు. ధర్మపురి నుంచి జగిత్యాల మీదుగా ప్రయాణం కష్టంగా ఉన్న నేపథ్యంలో రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మీదుగా కొత్త బస్సు సర్వీస్ ను ప్రారంభించినట్లు మంత్రి వివరించారు. కొత్త సర్వీస్ ఉదయం 7 గంటలకు జగిత్యాల నుంచి బయలుదేరి ధర్మపురి, రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం మీదుగా కరీంనగర్ చేరకుంటుందని మంత్రి అడ్లూరి తెలిపారు. కొత్త సర్వీస్ విద్యార్థులకు, ఉద్యోగులకు ఉపయోగంగా ఉంటుందని మంత్రి తెలిపారు. అదే విధంగా కరీంనగర్ నుంచి రాత్రి 9గంటలకు ధర్మపురికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ మంత్రి పొన్న ప్రభాకర్, ఆర్టీసీ ఎండి చోరవతో ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11 రూట్లలో నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి అనుమతి తీసుకున్నామని మంత్రి అడ్లూరి తెలిపారు. నియోజకవర్గంలోని విద్యార్థుల సౌకర్యం కోరకు నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి ఆదాయం



వచ్చే విధంగా సహకరించాలని మంత్రి అడ్లూరి కోరారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ ఆర్టీసీ సేవలు అందిస్తుందని అన్నారు. ధర్మపురికి వచ్చే భక్తుల కోసం నూతనంగా నడిపిస్తున్న సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని దినేష్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, నాయకులు వేముల రాజు, ధర్మపురి మున్సిపాల్ కౌన్సిలర్లు, జగిత్యాల డిపో మేనేజర్ రమేష్, నిర్మల్ డిపో మేనేజర్ పండరి, ఆర్టీసీ జగిత్యాల సీఐ శ్రీనివాస్, ఎఫ్ఎం నిర్మల్ నవీన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుకుగా పాల్గొనాలి

**జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి**

**సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 23 :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన కార్యక్రమంలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులు చురుకుగా పాల్గొని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు నకిలీ ఓటర్ల నమోదు జరగకుండా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కట్టా హైమావతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు గణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల నమోదు పత్రాలను అందజేసి వివరాలు




సేకరిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్నికల సిబ్బందితో పాటు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులు కూడా పాల్గొని, ఏ ఒక్క అర్హుడైన ఓటరు జాబితా నుంచి మిస్ కాకుండా, నకిలీ ఓటర్ల నమోదు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంపై ఎలాంటి అపోహలు అవసరం లేదని, ఒక వ్యక్తి ఒకే చోట ఓటరుగా నమోదై ఉండేలా చూడడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగించే ప్రక్రియ కాదని, మరణించిన వారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారి పేర్లను మాత్రమే తొలగిస్తామని స్పష్టం చేశారు. జూలై 25వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని, అనంతరం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ప్రజల నుంచి దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను అంతర్జాలం ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, సిద్దిపేట రెవెన్యూ విభాగ అధికారి సదానందం, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

**గజ్వేల్ టౌన్, జూన్ 23 :**

వార్షిక తనిఖీలలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపిఎస్ మంగళవారం గజ్వేల్ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించి, క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని రకాల రికార్డులను, కేస్ ఫైళ్లను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం పెండింగ్లో ఉన్న కేసుల పురోగతి, కేసుల స్థితిగతులు, కార్యాలయ ప్రాంగణం, రికార్డుల నిర్వహణను ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం గజ్వేల్ ఏసీపీ నర్సింలు కి ఆమె పలు కీలక సూచనలు చేశారు.ఎస్సీ ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన ఇన్వెస్టిగేషన్ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయంలోని అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ, నీట్గా ఉంచాలని, కార్యాలయ నిర్వహణలో తప్పనిసరిగా 5ఎస్ విధానాన్ని పాటించాలని సూచించారు.కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదుదారులతో ఓపికగా మాట్లాడి, వారి సమస్యలను వినాలని సీపీ స్పష్టం చేశారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, సంబంధిత గ్రీవెన్స్ పూర్తిగా పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు తో పాటు గజ్వేల్ టౌన్ ఇన్స్పెక్టర్ రవికుమార్,



గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు , సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల భద్రత, బాలల సంరక్షణకు ప్రాధాన్యత

**సీపీ సాధన రష్మి పెరుమాళ్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 23 :**

మహిళల భద్రత, బాలల సంరక్షణను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జిల్లా స్థాయి భాగస్వామ్య శాఖలు, వివిధ ఏజెన్సీలు, భరోసా కేంద్రం ప్రతినిధులతో కలిసి పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ అధ్యక్షతన సీపీ కార్యాలయంలో మంగళవారం ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళలు, బాలల భద్రత, న్యాయం, సాధికారతకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో జిల్లాలో ఇటీవల నమోదైన పోక్సో కేసుల పురోగతిని సమీక్షించారు.




బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా కేసుల విచారణను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సీపీ ఆదేశించారు. అలాగే బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. మహిళల రక్షణను మెరుగుపరచడం, బాధితులకు తక్షణ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలను సమర్థవంతంగా అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా సీపీ సాధన రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ మహిళలు, బాలలకు సంపూర్ణ భద్రత, న్యాయం అందించాలంటే అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని ప్రతి మహిళ, ప్రతి చిన్నారికి రక్షణ కల్పించే పటిష్ట వ్యవస్థను నిర్మించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

చురకలు



# భవిష్యత్తుకు సిద్ధమైన నిపుణులను తీర్చిదిద్దుతున్న గీతం ఆంగ్ల విభాగం

- ఆంగ్లంలో బీఏ, ఎంఏ కోర్సులకు జూన్ 26లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచన

**పటాన్చెరు, జూన్ 23 ::**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ క్యాంపస్‌లోని ఆంగ్ల, ఇతర భాషల విభాగం అందిస్తున్న బీఏ, ఎంఏ, పీహెచ్‌డీ ఆంగ్ల కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మోండల్ కోరారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్‌ఎస్) పరిధిలో పనిచేస్తున్న ఆంగ్ల విభాగం మేధోపరమైన పటిమ, సృజనాత్మకత, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించే విద్యా వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు.జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బోధన, పరిశోధనా అనుభవం కలిగిన అధ్యాపకులు విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. భారతీయ ఆంగ్ల రచనలు, బ్రిటిష్, అమెరికన్ సాహిత్యం, వలస సాహిత్యం, అనువాద అధ్యయనాలు, డిజిటల్ హ్యూమానిటీస్, సామాజిక భాషాశాస్త్రం, లింగ అధ్యయనాలు, ఆంగ్ల భాషా బోధన వంటి విభిన్న రంగాల్లో విద్యార్థులకు లోతైన అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.అంతేకాకుండా, కార్యశాలలు, జాతీయ-అంతర్జాతీయ సదస్సులు, నిపుణుల ఉపన్యాసాలు, జ్ఞాన భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రాయోగిక అనుభవాన్ని అందిస్తున్నామని తెలిపారు.ఈ విభాగంలో చదివిన విద్యార్థులకు విద్య, పరిశోధన, మీడియా, జర్నలిజం, సృజనాత్మక రచన, అనువాదం, కంటెంట్ రచన, సాంకేతిక




రచన, ప్రచురణ, కాపీ ఎడిటింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్, విధాన పరిశోధన సంస్థలు వంటి పలు రంగాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని డాక్టర్ మోండల్ పేర్కొన్నారు.డీన్ ప్రొఫెసర్ రథిన్ రాయ్, డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు ఆధ్వర్యంలో విభాగం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. గీతం ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం www.gitam.edu వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని లేదా 87120 18815, 88849 84000 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# కుకునూరుపల్లి ఎస్ఐగా బాలకృష్ణ బాధ్యతల స్వీకరణ

- శుభాకాంక్షలు తెలియజేసిన కొమ్ము విజయ్ కుమార్

**కుకునూరుపల్లి, జూన్ 23 :**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా బాలకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడడానికి ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ బాలకృష్ణను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ వైస్ చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రమంతా శాంతి భద్రతలకు ఎలాంటి లోటు లేకుండా ప్రజా పాలన కొనసాగుతుందని, అలాగే ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేశం, సీనియర్ నాయకులు నాగరాజు, బ్రహ్మము, బండమీది తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమమే సర్కార్ ధ్యేయం

- సన్న రకాలు సాగు చేయండి..
- విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్..

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 23 :**
రైతుల సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ (శ్రీరాములపల్లి) రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు.

**ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ**

గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వారి ధాన్యం, మొక్కజొన్న దిగుబడి వచ్చిందని అన్నారు. అధికారుల సమన్వయంతో పనిచేసి రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. ధాన్యం



కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలు మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి కోరారు. గొల్లపల్లి మండలం శ్రీరాములు పల్లి గ్రామంలో రూ. 70 లక్షలతో ప్రమాదకరంగా ఉన్న కరెంట్ వైర్లు తొలగించినట్లు మంత్రి వివరించారు. గ్రామంలో ఐకేపీ సెంటర్ తో పాటు గ్రౌండ్ ప్రతిపాదనలు వచ్చాయని గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ**

రైతులు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715 తదితర నాణ్యమైన వరి విత్తనాలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించి మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా పంట నాణ్యత పెరిగి రైతులకు ఆర్థికంగా మరింత లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. గతంలో పెద్ద ఎత్తున రైతులు యూరియా స్టాక్ చేసే వారిని కొత్తగా తీసుకువచ్చిన యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధిక మొత్తంలో యూరియా వాడటం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. రోడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు సన్న వడ్లు సాగు చేయాలని సూచించారు.

**జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ**

ఈనెల 23వ తేది నుంచి 31వ తేదీ వరకు రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఏడు రకాల విత్తనాలు మాత్రమే సాగు చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు మంత్రి అడ్లూరి పరామర్శ




**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 23 :**
తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వివిధ ప్రాంతాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గొల్లపల్లి మండల ఉప సర్పంచ్ గురుజల బుచ్చిరెడ్డి నానమ్మ గురుజల వెంకటమ్మ ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న మంత్రి లక్ష్మణ్ కుమార్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ తన సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం జగిత్యాలకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మంచాల రామేశం మరణించిన విషయం తెలుసుకుని మంత్రి లక్ష్మణ్ కుమార్, సంజయ్ కుమార్‌తో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రామేశం సేవలను స్మరించుకున్న మంత్రి, ఆయన మరణం ఆధ్యాత్మిక రంగానికి, సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. అలాగే వెల్గటూర్ మండలం పాశిగామ గ్రామానికి చెందిన కట్టెం తిరుపతి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ప్రభుత్వం మరియు పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక అమలుపై ప్రత్యేక అధికారిణి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు సమీక్ష

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23 :**
ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను సమగ్రంగా విశ్లేషించి వాటి పరిష్కారానికి జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించాలని జిల్లాకు ప్రత్యేక అధికారిణిగా నియమితులైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలు, పురోగతిపై ప్రత్యేక అధికారిణి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో, బాధ్యతాయుతంగా అమలు చేసి విజయవంతం చేసినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రగతి ప్రణాళిక సభల సందర్భంగా ప్రజల నుంచి అందిన వినతులు, సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు, శాఖల వారీగా థీమ్ ఆధారంగా అమలు చేసిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేకూరిన ప్రయోజనాలు, సాధించిన లక్ష్యాలు, ప్రజల నుంచి వచ్చిన స్పందన తదితర అంశాలపై శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతుల్లో ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టవచ్చో సమగ్రంగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం అమలు సందర్భంగా చేపట్టిన వినూత్న కార్యక్రమాలు (ఇన్నోవేషన్లు) మంచి ఫలితాలు సాధించి ఉంటే వాటిని జిల్లాలో నిరంతరంగా కొనసాగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రత్యేకించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల చేరువను మెరుగుపరిచిన చర్యలు, ప్రజల నుంచి విశేష ఆదరణ పొందిన కార్యక్రమాలను గుర్తించి భవిష్యత్తులో మరింత విస్తృతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలలో పనిచేసిన అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి మరింత మెరుగైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల సందర్భంగా వివిధ శాఖలకు ప్రజలు చేసిన విజ్ఞప్తులను అధ్యయనం చేసి, వాటిని శాఖల స్థాయిలోనే పరిష్కరించగలమా, ఇతర శాఖల సమన్వయం అవసరమా లేదా ప్రభుత్వ స్థాయిలో ప్రత్యేక చర్యలు అవసరమా అనే అంశాలపై దృష్టి సారించి




జిల్లా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను మూడు విభాగాలుగా వర్గీకరించామని తెలిపారు. శాఖల అధికారులు గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని పరిష్కరించగల అంశాలపై వెంటనే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడం, మెరుగైన సౌకర్యాలు అందించడం లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, అన్ని శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసును చేదించిన పోలీసులు..





## నిందితుడు రిమాండ్..

**దుబ్బాక ప్రతినిధి, జూన్ 23 :**
దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎలిగే రమేష్ (27)ను అదే గ్రామానికి చెందిన ఎలిగే రాజు భూ వివాదాలు, పాత కక్షలు, అలాగే తన భార్యతో రమేష్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో మంగళవారం ఉదయం తిమ్మాపూర్ శివారులోని పద్మనాభునిపల్లి చెరువు కట్ట వద్ద గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడిని అదే రోజు సాయంత్రం హబ్సీపూర్ గ్రామంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి వెల్లడించారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించగా, అతని వద్ద నుండి హత్యకు ఉపయోగించిన గొడ్డలి, రక్తపు మరకలు ఉన్న దుస్తులు, మొబైల్ ఫోన్, టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరు పరిచి, కేసు దర్యాప్తు కొనసాగుతుందని వెల్లడించారు.

# ముంపు గ్రామాల ప్రజలకు పన్ను మినహాయింపు నిర్మాణ అనుమతులు కల్పించాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన

**గజ్వేల్ ప్రతినిధి, జూన్ 23 :**
గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనమైన ముంపు గ్రామాల ప్రజలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్అండ్ఆర్ కాలనీ నిర్వాసితులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. నిర్వాసితుల న్యాయమైన పోరాటానికి మద్దతుగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, దామరంచ ప్రతాప్ రెడ్డి, పెద్ది బాలకిషన్, చింత కింది కనకయ్య, గూడూరి రాములు, నిర్వాసితుల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రాజెక్టుల కోసం సర్వస్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల ప్రజల పట్ల ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు సానుభూతితో వ్యవహరించాలని కోరారు. మున్సిపాలిటీలో విలీనమైన ముంపు గ్రామాల ప్రజలకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థిరమైన ఉపాధి అవకాశాలు లేక, పరిహారం అందక నిర్వాసితులు తీవ్ర



ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిర్వాసితులు తమ అవసరాల కోసం కట్టుకుంటున్న ఇళ్లను, ఇతర నిర్మాణాలను అధికారులు కూల్చివేయడం అత్యంత అమానుష చర్య అని నాయకులు మండిపడ్డారు. నిర్వాసితుల త్యాగాల వల్లనే తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందనే నిజాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. గ్రామాలను ఖాళీ చేసే సమయంలో ఈ ప్రాంతాలను పంచాయతీలుగానే కొనసాగిస్తామని, ఒకవేళ మున్సిపాలిటీలో విలీనం చేస్తే 10 సంవత్సరాల వరకు పన్ను మినహాయింపు కల్పిస్తామని అప్పటి ప్రభుత్వం మౌఖికంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఈ లోపే ప్రభుత్వం మారడంతో నిర్వాసితులు అన్యాయానికి గురయ్యారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మరియు మున్సిపల్ యంత్రాంగం మానవతా దృక్పథంతో ఆలోచించి, విలీన గ్రామాల ప్రజలకు కనీసం 5 నుండి 10 సంవత్సరాల వరకు ఆస్తి పన్ను మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు నివాస గృహాలు నిర్మించు కునేందుకు ప్రత్యేక నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని వెంటనే విడుదల చేసి వారి జీవనోపాధికి పూర్తి భరోసా కల్పించాలని నాయకులు సవినయంగా ప్రార్థించారు. లేనిపక్షంలో నిర్వాసితుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముంపు గ్రామాల బాధితులు, ఆర్అండ్ఆర్ కాలనీ నివాసితులు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నవాజ్ మీరా, కౌన్సిలర్లు, అత్తెల్లి శ్రీనివాస్, కోట బాబు, ముంపు గ్రామాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు కథకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన పాలగుమ్మి

## నేడు పాలగుమ్మి పద్మరాజు జయంతి

తెలుగు కథా సాహిత్యంలో ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు. అయన తన జీవిత కాలమంతా రచనలతోనే జీవనం సాగించారు. పాలగుమ్మి పద్మరాజు 1915 జూన్ 24న పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలంలోని తిరుపతిపురంలో జన్మించారు. విద్యాభ్యాసం స్వస్థలంలోనూ, ఇతర ప్రాంతాల లోనూ పూర్తి చేసుకున్న ఆయన 1939వ సంవత్సరం నుండి 1952 వరకు కాకినాడలోని పీ.ఆర్. ప్రభుత్వ కళాశాలలో సైన్సు లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. తన పంతొమ్మిదో యేట నుంచే రచనలు మొదలు పెట్టారు. మొదట ఛందోబద్ధంగా పద్యాలు రాసి తర్వాత వచనం లోకి వచ్చారు. పాలగుమ్మి పద్మరాజు తన సాహిత్య జీవన యానంలో 60 కథలు, ఎనిమిది నవలలు, 30 కవితలు... ఇంకా లెక్కలేనన్ని నాటికలు మరియు నాటకాలను రచించారు. ఆయన రాసిన 60 కథలలో గాలివాన, పడవ ప్రయాణం, ఎదురు చూసిన ముహూర్తం అనే మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. తెలుగు మీద ఎంత పట్టు ఉందో ఇంగ్లీష్ మీద కూడా అంతే అధికారం ఉంది. అందుకే తాను రాసిన కథానికలను తానే ఆంగ్లంలోకి తర్జుమా చేసుకునే వారు. ఆ క్రమంలోనే 1958లో అంతర్జాతీయ కథానికల పోటీలో 'గాలివాన' కథ రాసి పంపితే బహుమతి వచ్చింది. "గాలివాన" తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మికే చెందుతుంది. ఈ కథను ప్రపంచం లోని అనేక బాషలలోకి అనువదించారంటే ఆ నవల సాహితీ ప్రపంచంలో ఎంతగా పేరు తెచ్చుకుందో అర్థం అవుతుంది. అయన మొదటి కథ "సుబ్బి". ఎన్నో కథలు రాసినప్పటికీ వాటిలో ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చిన కథ "గాలివాన" మాత్రమే. ఈ కథ 1952వ సంవత్సరంలో న్యూయార్క్‌లోని "హెరాల్డ్ ట్రిబ్యూన్"వారు నిర్వహించిన ప్రపంచ కథల పోటీలలో రెండువ బహుమతిని గెలుచుకుంది. ఈ పోటీలకు మొత్తం 23 దేశాల నుంచి 59 కథలు ఎంపిక కాగా, అందులో భారత దేశం నుంచి మూడు కథలు ఎంపికవగా.. అందులో గాలివాన ఒకటి. అలా తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మి పద్మరాజుకే చెందుతుంది. ఆయన రాసిన నవలలో బతికిన కాలేజీ, నల్లరేగడి, రామరాజ్యానికి రహదారి, రెండో అశోకుడి మూన్నాళ్ల పాలన మొదలైన రచనలు ముఖ్యమైనవి. ఆయన రాసిన కవితలు, పద్యాలు, పాటలు, కథానికలు, నవలలు. రేడియో నాటకాల గురించి అందరికీ తెలిసినా సినిమా రచనల గురించి చాలా మందికి తెలియదు. ఆయన సినిమా ప్రవేశం కృష్ణశాస్త్రి ద్వారా జరిగింది. నాటికే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సినిమాలకు పాటలు రాస్తున్నారు. బిఎన్‌రెడ్డి సినిమా తీయాలనుకున్న సంగతి తెలిసి పద్మరాజుకు కబురు చేస్తే మద్రాసు వెళ్లారు. 1954వ సంవత్సరంలో ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, తాను వాహినీ పతాకం కింద నిర్మించిన "బంగారు పాప" అనే చిత్రానికి మాటలు రాయమని పద్మరాజును కోరారు. అప్పటి నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు అనేక సినిమాలకు కథలు, పాటలు పాలగుమ్మి కలంనుంచి జాలు వారాయి. 'బంగారుపాప' సినిమాలో కోటయ్య పాత్ర ఎస్‌వి రంగారావుకు చాలా పేరు వచ్చింది. 'ఇటువంటి పాత్ర మళ్లీ నాకు దొరకలేదు' అని ఎన్నోసార్లు చాలామందితో సంబరంగా అనేవారట. ఆ తరవాత 'రంగుల రాట్నం' చిత్రానికి కథ మాటలు రాశారు. ఆ కథకు నంది అవార్డు వచ్చింది. రంగుల రాట్నం నటుడు చంద్రమోహన్ పాత్రకు ప్రాణం పోసి, ఆయనను చిత్ర సీమలో నిలబెట్టింది. తర్వాత భావ నారాయణ తీసిన 'గోపాలుడు భూపాలుడు' జానపద చిత్రానికి కథ, మాటలు అందించారు. మురారి నిర్మాణంలో వచ్చిన 'సీతామాలక్ష్మి' చిత్రానికి స్క్రీన్‌ప్లే రాశారు. సినిమా అంటే అవగాహన ఉండి పాటలు, మాటలు, కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, సంగీతం,.. అన్ని శాఖల లోనూ పని చేశారు. దేవుడిచ్చిన భర్త, బికారి రాముడు... చిత్రాలకు దర్శకత్వం వహించారు. మొత్తం 30కి పైగా సినిమాలకు పని చేశారు. ఎడిటింగ్, ప్రాసెసింగ్, బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ దాకా అన్నీ చూసి నేర్చుకున్నారు. శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ సినిమాకు పాటలు రాయడానికి కృష్ణశాస్త్రి రావడం కొంచెం ఆలస్యం అయితే పద్మరాజు తో ఒక పాట రాయించారు, అదే 'రాకోయీ అనుకోని అతిథీ'. అంతకు ముందే 'భక్త ప్రహ్లాద' చిత్రానికి 'జననీ వర దాయనీ భవానీ' అనే గీతం కూడా రచించారు. దాసరిగారితో చాలా సినిమాలు చేశారు. దాసరి, పద్మరాజును 'మా గురువు గారు' అనే వారు. దాసరి, పద్మరాజు వద్ద రైటర్‌గా పని చేశారు. దాసరి ఒకేసారి నాలుగైదు సినిమాలు తీయడం వల్ల పద్మరాజు సలహాలను ఎక్కువగా అడిగేవారు. తరువాత భక్త శబరి, బంగారు పంజరం లాంటి అనేక సినిమాలలో పాలగుమ్మి పనిచేసినా... తన సినిమాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, వ్యాపారపరంగా నష్టాలను చవి చూశాయి. పాలగుమ్మి దర్శకుడిగా "బికారి రాముడు" అనే సినిమాను తీసినా అది కూడా విజయవంతం కాలేదు. ఆ తరువాత పాలగుమ్మి నవల "నల్లరేగడి"ని "మాఊరి కథ" అనే పేరుతోనూ, "పడవ ప్రయాణం" అనే కథను "స్త్రీ" పేరు తోనూ సినిమాలు తీశారు. సాహితీ వినీలాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ, ప్రత్యేక గుర్తింపు పొందిన అచ్చ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు 1983 ఫిబ్రవరి 27న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# అక్షరానికి పట్టిన మార్కుల గ్రహణం

## విద్యా రంగాన నైతిక సంక్షోభం!

## ర్యాంకుల రొంపిలో విద్యాగంధం...

## అంగడి సరుకైన అక్షరజ్ఞానం!

**మానవ మేధస్సుకు పదును పెట్టి, సత్ప్రవర్తనను నేర్పి, సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించే ఒక దివ్యమైన సాధనం విద్య. ఒకప్పుడు పాఠశాల విద్య అంటే కేవలం అక్షరాల గుర్తింపు మాత్రమే కాదు; విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, ఆలోచనా శక్తిని విశ్వవ్యాప్తం చేయడం, నిశిత విమర్శనాత్మక జ్ఞానాన్ని పెంపొందించడం, వ్యక్తిత్వ వికాసానికి సుదృఢమైన పునాది వేయడం అనే మహోన్నతమైన, పవిత్రమైన భావన ఉట్టిపడేది. ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే బోధకుడు కాదు, విద్యార్థి జీవితాన్ని సమున్నతంగా తీర్చిదిద్దే శిల్పిగా విరాజిల్లాడు. కానీ, నేటి ఆధునిక, ప్రపంచీకరణ యుగంలో మార్కెట్ శక్తుల ప్రవేశంతో విద్యా వ్యవస్థ తన ప్రాథమిక నైతిక అస్తిత్వాన్ని కోల్పోతూ ఆందోళనకరమైన రీతిలో వ్యాపారీకరణ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా పాఠశాల విద్యా ప్రస్థానంలో అత్యంత కీలకమైన మైలురాయిగా భావించే పదో తరగతి (ఎస్‌ఎస్‌సీ) బోర్డు పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను పరిశీలిస్తే, సమకాలీన వ్యవస్థ ఎంతటి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందో స్పష్టమవుతుంది. మార్కుల వేట, ఉత్తీర్ణత శాతం పెంచుకోవాలనే తాపత్రయం, కార్పొరేట్ విద్యాసంస్థల అహంకారపూరితమైన ర్యాంకుల పోటీల మధ్య అసలైన విద్యా ప్రమాణాలు నిలువునా బలైపోతున్నాయి. విద్యార్థుల హృదయాలలో జ్ఞాన తృష్ణను, జిజ్ఞాసను రేకెత్తించాల్సింది పోయి, కేవలం అంకెలు, శాతాల చుట్టూ తిరిగే ఒక కృత్రిమ ఫలితాల సంస్కృతిని రుద్దడం వల్ల, విద్య అనేది నిరంతర ఆనందదాయకమైన ప్రక్రియ కాస్తా, అత్యంత భయంకరమైన మానసిక బంధనంగా మారిపోతోంది.**

భారతదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు ఒక కోటి యాభై లక్షల మంది విద్యార్థులు పదో తరగతి లేదా తత్సమాన బోర్డు పరీక్షల వేదికలపై తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా, అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి ప్రతి ఏడాది దాదాపు పది లక్షలకు పైగా బాల్యప్రాయపు విద్యార్థులు ఎస్‌ఎస్‌సీ పరీక్షల పీఠం ఎక్కుతున్నారు. అయితే ప్రతి ఏటా ఈ పరీక్షల ఫలితాలు వెలువడినప్పుడు సమాజంలో కనిపించే దృశ్యాలు అత్యంత విచిత్రంగా, దారుణంగా ఉంటున్నాయి. ప్రభుత్వాలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, పాఠశాల యాజమాన్యాలు తాము సాధించిన ఉత్తీర్ణత శాతాలనే ఒక గొప్ప విజయంగా, అట్టహాసంగా చాటుకుంటూ ప్రచార ఆర్భాటాల్లో మునిగిపోతున్నాయి. ఏ జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది, ఏ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డులకెక్కింది, ఎవరికి పదికి పది జీపీఏ గ్రేడింగ్ వచ్చింది అనే అంశాలే పత్రికల ముఖ్యాంశాలుగా, దృశ్య మాధ్యమాల చర్చలుగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తూ, ఈ సంఖ్యాపరమైన ఆరాటంలో అసలైన ప్రాథమిక ప్రశ్నలు పూర్తిగా అణచివేయబడుతున్నాయి. ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు నిజంగా ఆయా సబ్జెక్టులలో ఎంత మేర ప్రాథమిక అవగాహనను, లోతైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నారనే శోధన ఎక్కడా జరగడం లేదు. చదివిన అంశాన్ని నిత్యజీవితంలో అన్వయించుకునే సృజనాత్మక నైపుణ్యాలు వారిలో వికసించాయా, రేపటి సమాజంలో ఎదురయ్యే ఆర్థిక, సామాజిక సవాళ్లను ఎదుర్కొనేందుకు సరిపడా వివేకాన్ని వారు సంపాదించగలిగారా అనే మౌలిక ఆశయాలు ఈ శాతాల హోరులో కొట్టుకుపోతున్నాయి. ఈ ఉత్తీర్ణత శాతం పెంచాలనే అదృశ్య, నిరంకుశ ఒత్తిడి అటు ప్రభుత్వ పాఠశాలలపై, ఇటు ప్రైవేటు పాఠశాలలపై తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపుతోంది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికను విద్యార్థులకు క్షుణ్ణంగా, హృదయాలకు హత్తుకునేలా బోధించి వారిలో జిజ్ఞాసను రేకెత్తించాల్సింది పోయి, కేవలం పరీక్షా సన్నద్ధతకే సింహభాగం సమయాన్ని ధారపోస్తున్నారు. ఫలితంగా సిలబస్‌ను సంపూర్ణంగా బోధించకుండా, కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చిపెట్టే ముఖ్యమైన ప్రశ్నలు, రెడీమేడ్ గెస్ పేపర్లు, ప్రశ్న బ్యాంకులు, నమూనా పత్రాల కంఠస్థీకరణకే పరిమితం చేస్తున్నారు. ఇది విద్యార్థుల్లోని ఆలోచనా శక్తిని చంపేసి, కేవలం తాత్కాలిక జ్ఞాపకశక్తి ఆధారిత క్షుద్ర విద్యను మాత్రమే ప్రోత్సహిస్తోంది.

ఈ భయానకమైన పోటీ ప్రపంచంలో కొన్ని కార్పొరేట్ మరియు ప్రైవేట్ విద్యాసంస్థలు తమ వ్యాపార సామ్రాజ్యాల విస్తరణకు, కొత్త అడ్మిషన్ల వేటకు విద్యార్థుల మార్కులను అంగడి సరుకులుగా వాడుకుంటున్నాయి. టాప్ ర్యాంకులను సాధించడమే లక్ష్యంగా, పదో తరగతి వయసులో ఉన్న పసివాళ్లపై అమానవీయమైన, అసాధారణమైన మానసిక ఒత్తిడిని నూరిపోస్తున్నాయి. తెల్లవారుజాము ఐదు గంటల నుంచే ప్రత్యేక తరగతులు, రాత్రి పది గంటల వరకు స్టడీ అవర్ల పేరిట విద్యార్థులను ఇనుప గదుల్లో బందీలను చేస్తున్నాయి. బాల్యానికి సహజసిద్ధమైన ఆటపాటలు, శారీరక శ్రమ, మానసిక వికాసానికి కనీస స్థానం కూడా లేకుండా, కేవలం పరీక్షల్లో మార్కులు గుంజడమే ధ్యేయంగా సాగుతున్న ఈ యాంత్రిక విధానం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక వైకల్యానికి, నిరాశకు లోనవుతున్నారు. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) ఏటా విడుదల చేస్తున్న నివేదికలు ఈ భయంకరమైన వాస్తవాన్ని కళ్లముందు ఉంచుతున్నాయి. పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక, తల్లిదండ్రుల మితిమీరిన అంచనాలను అందుకోలేక, ఆశించిన గ్రేడింగ్ రాదేమోననే తీవ్రమైన భయాందోళనలతో దేశవ్యాప్తంగా ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు ఆత్మహత్యల వంటి దారుణమైన నిర్ణయాలు తీసుకుని కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. మార్కుల కోసం ఆరాటపడే ఈ క్రూరమైన విద్యా వ్యవస్థ పసివాళ్ల బాల్యాన్ని బలితీసుకుంటున్న వైనం సమాజ విజ్ఞతకే ఒక పెద్ద సవాలుగా నిలుస్తోంది.

ఉత్తీర్ణత శాతం కోసం సాగుతున్న ఈ అడ్డగోలు రేసు మరో ప్రమాదకరమైన, అనైతికమైన ధోరణికి దారితీస్తోంది. అదే పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగతంగా జరుగుతున్న అపసవ్యాలు, అవకతవకలు. కొన్ని పాఠశాలలు, విద్యాసంస్థలు, ఆఖరికి కొన్ని ప్రాంతాల్లోని విద్యాశాఖ యంత్రాంగాలు కూడా తమ పరిధిలోని ఫలితాలు మెరుగ్గా చూపించుకోవడానికి పరీక్షల నిర్వహణలో అవాంఛనీయమైన జోక్యానికి, అక్రమాలకు పాల్పడుతున్నాయనే నగ్నసత్యాలు నిరంతరం వెలుగుచూస్తూనే ఉన్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక శక్తుల ప్రయోజనాల కోసం సామూహిక కాపీయింగ్‌ను పరోక్షంగా ప్రోత్సహించడం, ఇన్విజిలేషన్ విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించడం లేదా చూసీచూడనట్లు వ్యవహరించడం, విద్యార్థులకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమాధానాలు చేరవేయడం వంటి ఘటనలు తరచూ విద్యా వ్యవస్థ నైతికతను ప్రశ్నిస్తున్నాయి. ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత, పరీక్షా కేంద్రాల వెలుపల నుండి మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాలకే సమాధానాలు లోపలికి చేరవేయడం వంటి సంఘటనలు దేశవ్యాప్తంగా పరీక్షల విశ్వసనీయతను నిలువునా దెబ్బతీస్తున్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో వివిధ రాష్ట్రాల్లో వెలుగుచూసిన సామూహిక కాపీయింగ్ ఉదంతాలు, ముఖ్యంగా పాఠశాల భవనాల కిటికీలు, గోడలు ఎక్కి మరీ బంధువులు విద్యార్థులకు కాపీ చీటీలను అందిస్తున్న అపరూప దృశ్యాలు అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. ఇటువంటి అక్రమాల ద్వారా, కాపీయింగ్ సాయంతో బోర్డు పరీక్షల గండం గట్టెక్కుతున్న విద్యార్థులు, భవిష్యత్తులో ఉన్నత విద్యా కోర్సులలోనూ, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలోనూ, అత్యంత పోటీతో కూడిన ఉపాధి రంగాలలోనూ తీవ్రమైన అసమర్థతను ప్రదర్శిస్తూ నిలువునా కుప్పకూలిపోతున్నారు. పునాది లోపించిన ఈ విద్యా విధానం దేశ మానవ వనరుల నాణ్యతను ఎంతగా దిగజారుస్తుందో చెప్పడానికి ఇదొక సజీవ సాక్ష్యం.

పరీక్షల నిర్వహణను మరియు విద్యార్థుల భవిష్యత్తును పట్టిపీడిస్తున్న మరో ప్రధాన రుగ్మత 'మార్కుల దాహం'. ప్రస్తుతం అమలులో ఉన్న గ్రేడింగ్ విధానంలో 10 జీపీఏ సాధించడం, లేదా 600 మార్కులకు గానూ 600 మార్కులు సాధించాలనే అహేతుకమైన, కృత్రిమమైన లక్ష్యాలను విద్యార్థులపై రుద్దడం వల్ల సమాజంలో ఒక అనారోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొంది. కేవలం అర మార్కు లేదా ఒక మార్కు తక్కువ వచ్చినా విద్యార్థులు తాము జీవితంలో సర్వస్వం కోల్పోయామనే తీవ్ర నైరాశ్యంలోకి, కుంగుబాటులోకి జారిపోతున్నారు. తల్లిదండ్రుల మితిమీరిన ఆశలు, ఉపాధ్యాయుల నిరంతర వేధింపులు, యాజమాన్యాల హెచ్చరికలు వారిని మానసికంగా జీవచ్ఛవాలుగా మార్చుతున్నాయి. విద్యాభ్యాసం అంటే కేవలం అంకెలను స్కోర్ చేయడం కాదు, అదొక నిరంతర పరిణామ ప్రక్రియ అనే మౌలిక సత్యం క్రమంగా మరుగున పడిపోతోంది. జాతీయ విద్యా విధానం-2020 (ఎన్‌ఈపీ) ఈ తీవ్రమైన ప్రమాదాన్ని ముందే గుర్తించి, విద్యను కేవలం పరీక్షల ఆధారితంగా కాకుండా, విద్యార్థుల సమగ్ర మేధో, శారీరక, మానసిక మూల్యాంకన విధానంతో (360 డిగ్రీల అసెస్‌మెంట్) అంచనా వేయాలని బలంగా సూచించింది. విద్యార్థులలో దాగి ఉన్న విమర్శనాత్మక ఆలోచన, సహజ సిద్ధమైన నైపుణ్యాలు, సామాజిక బాధ్యతలను గుర్తించడమే విద్యా పరమావధిగా ఉండాలని స్పష్టం చేసినప్పటికీ, క్షేత్రస్థాయి ఆచరణలో మాత్రం ఇంకా పాత మార్కుల ఆధారిత వికృత క్రీడే కొనసాగుతోంది. పాఠశాలల పనితీరును, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని నేటికీ కేవలం ఆయా తరగతుల్లో సాధించిన పాస్ పర్సంటేజీలతోనే ముడిపెట్టి వేతనాలు, ప్రమోషన్లను అంచనా వేస్తుండటం వల్ల, వ్యవస్థలో ఆశించిన గుణాత్మక మార్పు రావడం లేదు.

నిజమైన విద్యా ప్రమాణాల పునరుద్ధరణ జరగాలంటే, వంద శాతం ఫలితాల భ్రమల నుండి విద్యాశాఖ, సమాజం మొదట బయటకు రావాలి. విద్యార్థి ఆయా తరగతులకు నిర్దేశించిన కనీస అభ్యాస సామర్థ్యాలను (లెర్నింగ్ అవుట్‌కమ్స్) సాధించాడా లేదా అన్నదే ఏకైక ప్రామాణికంగా మారాలి. చదివిన విషయాన్ని సొంతంగా విశ్లేషించి స్పష్టంగా రాయగలగడం, గణిత సమస్యలను భయం లేకుండా సాధించగలగడం, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవడం వంటి అంశాలే నిజమైన ప్రగతికి సంకేతాలు. పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత, కట్టుదిట్టమైన పర్యవేక్షణ అత్యంత ఆవశ్యకం. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీటీవీ కెమెరాల నిఘా, డిజిటల్ పద్ధతిలో ప్రశ్నాపత్రాల పంపిణీ, బయోమెట్రిక్ హాజరు, మూల్యాంకన ప్రక్రియలో కఠినమైన కోడింగ్ విధానం వంటి సాంకేతిక సంస్కరణలను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా అక్రమాలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయవచ్చు. అదే సమయంలో, ఉపాధ్యాయులపై కేవలం ఫలితాలు తేవాలనే కక్షసాధింపు ఒత్తిళ్లను ఆపి, వారి బోధనా నాణ్యత ఆధారంగా వారికి గౌరవం దక్కాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పక్క పిల్లలతో పోల్చి చూసే మానసిక జాడ్యాన్ని వదిలించుకోవాలి. ప్రతి బిడ్డలోనూ ఒక అపురూపమైన, ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. సమాజంలో గౌరవంగా బతకడానికి అందరికీ వందకు వంద మార్కులు రానవసరం లేదు. వారి ఆసక్తులు, సృజనాత్మక నైపుణ్యాలను గుర్తించి స్వేచ్ఛగా ప్రోత్సహించినప్పుడే నైతిక విలువలతో కూడిన నిజాయితీ గల పౌరులు తయారవుతారు. పరీక్షలు అనేవి విద్యార్థి మేధస్సుకు ఒక ఆరోగ్యకరమైన కొలమానం కావాలి తప్ప, విద్యను పరీక్షల గదికే పరిమితం చేసే ఒక నిర్బంధ సాధనంగా మారకూడదు. ఉత్తీర్ణత శాతం కన్నా విద్యా నాణ్యతకు, మానవత్వానికి ప్రాధాన్యమిచ్చే ఒక నూతన సంస్కృతి ఏర్పడినప్పుడే విద్యా రంగం సరైన గాడిలో పడి, దేశ భవిష్యత్తుకు నిజమైన భరోసా లభిస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఒరాకిల్‌లో భారీ ఉద్యోగ కోతలు

## ఏఐ ప్రభావంతో ఒకే ఏడాదిలో 21 వేల మంది తొలగింపు

**న్యూఢిల్లీ, జూన్ 23 :** కృత్రిమ మేధ సాంకేతికత వేగంగా విస్తరిస్తుండటంతో వ్యాపార రంగంలో పెద్ద మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అదే సమయంలో ఉద్యోగ మార్కెట్‌పై కూడా దీని ప్రభావం తీవ్రంగా పడుతోంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం ఒరాకిల్ భారీ స్థాయిలో ఉద్యోగులను తొలగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒరాకిల్ తాజాగా సమర్పించిన వార్షిక నివేదిక ప్రకారం 2026 ఆర్థిక సంవత్సరంలో సంస్థ తన మొత్తం ఉద్యోగులలో సుమారు 13 శాతం మందిని తగ్గించింది. గత ఏడాది సుమారు 1,62,000 మంది ఉద్యోగులు ఉండగా, 2026 మే 31 నాటికి ఆ సంఖ్య 1,41,000కు పడిపోయింది. అంటే ఒకే ఏడాదిలో దాదాపు 21,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఈ ఉద్యోగ కోతల ప్రభావం భారత్‌లో కూడా గణనీయంగా కనిపించింది. బెంగళూరు, హైదరాబాద్, పుణె వంటి నగరాల్లో ఉన్న ఒరాకిల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో సుమారు 10,000 మంది ప్రభావితమయ్యారని సమాచారం. ఇది భారత సిబ్బందిలో దాదాపు 20 శాతం వరకు ఉంటుందని అంచనా. కంపెనీ ప్రకారం, తమ వ్యాపార ప్రక్రియలన్నింటిలో కృత్రిమ మేధ సాంకేతికతను విస్తృతంగా ప్రవేశపెట్టడం వల్లే ఈ సిబ్బంది తగ్గింపు జరిగిందని తెలిపింది. భవిష్యత్తులో కూడా ఆటోమేషన్, ఏఐ ఆధారిత వ్యవస్థల కారణంగా మరిన్ని ఉద్యోగ కోతలు జరిగే అవకాశం ఉందని సంస్థ స్పష్టం చేసింది. ఏఐ వలన సామర్థ్యం పెరుగుతున్నప్పటికీ, అదే స్థాయిలో ఉద్యోగ భద్రతపై ప్రశ్నలు పెరుగుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




# ఏఐ డిమాండ్ పెరుగుదలతో గ్యాడ్జెట్ ధరలపై ఒత్తిడి



## మొబైల్, ల్యాప్‌టాప్‌లు మరింత ఖరీదు అయ్యే అవకాశం

**హైదరాబాద్, జూన్ 23 :** రాబోయే రోజుల్లో స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని టెక్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కృత్రిమ మేధ సాంకేతికత వేగంగా విస్తరించడం ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా మారింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీలు భారీ స్థాయిలో ఏఐ మోడల్స్ అభివృద్ధి చేస్తున్నాయి. ఈ సిస్టమ్స్‌కు అవసరమైన అధిక సామర్థ్యం గల మెమరీ చిప్స్, ప్రాసెసర్లు భారీగా వినియోగంలోకి వస్తున్నాయి. దీంతో చిప్‌ల డిమాండ్ గణనీయంగా పెరిగి, సరఫరా తక్కువగా మారిందని నిపుణులు చెబుతున్నారు. డిమాండ్ పెరగడం, సరఫరా తగ్గడం కారణంగా చిప్‌ల ధరలు పెరుగుతున్నాయి. దాంతో స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు, గేమింగ్ పరికరాల తయారీ ఖర్చు కూడా పెరుగుతోంది. ఈ అదనపు ఖర్చును కంపెనీలు వినియోగదారులపై మోపే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో కొత్త గ్యాడ్జెట్లు కొనడం సామాన్య వినియోగదారులకు మరింత ఖరీదైన వ్యవహారంగా మారవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి వినియోగదారులపై ఈ ధరల పెరుగుదల ప్రభావం ఎక్కువగా పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# అమెరికా-ఇరాన్ చర్చల్లో పురోగతి


## 66 రోజుల పాటు చమురు ఆంక్షల సడలింపు




**జెనీవా, జూన్ 23 :** అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్ వేదికగా జరుగుతున్న చర్చలు సానుకూలంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. ఈ చర్చల్లో అణు తనిఖీలు, హార్ముజ్ జలసంధి ద్వారా స్వేచ్ఛా రవాణా వంటి కీలక అంశాలపై ఇరు దేశాలు చర్చించినట్లు తెలుస్తోంది. ఇరాన్ తమ చమురు ఎగుమతులపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కోరగా, అమెరికా పక్షాన కొంత సానుకూల స్పందన వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో అమెరికా ప్రభుత్వం సోమవారం ఇరాన్‌పై ఉన్న చమురు ఆంక్షలను పాక్షికంగా తాత్కాలికంగా ఎత్తివేసింది. ఈ సడలింపు 66 రోజుల పాటు అమల్లో ఉండనుందని అమెరికా ట్రెజరీ శాఖ వెల్లడించింది. ప్రకటన ప్రకారం, ఇరాన్ ఆగస్ట్ 21 వరకు ముడి చమురు, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, పెట్రోలియం ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించుకునే అవకాశం కల్పించబడింది. ఇది 2026 జూన్ 17న ఇరు దేశాల మధ్య కుదిరిన 60 రోజుల ఒప్పందం ఆధారంగా తీసుకున్న నిర్ణయమని అధికారులు తెలిపారు. ఈ పరిణామంతో ఇరాన్ చమురు తిరిగి ప్రపంచ మార్కెట్‌లోకి రావడంతో అంతర్జాతీయ చమురు ధరలు తగ్గే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన సరఫరా పరిస్థితి కొంత స్థిరపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా-ఇరాన్ మధ్య చమురు వాణిజ్యం పూర్తిగా నిలిచిపోయిన నేపథ్యంలో, ఈ తాజా నిర్ణయం రెండు దేశాల సంబంధాల్లో ఒక కీలక మలుపుగా భావిస్తున్నారు.

# బీఎస్ఎన్ఎల్ నుంచి తక్కువ ఖర్చు రీఛార్జ్ ప్లాన్

**న్యూఢిల్లీ, జూన్ 23 :** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ కొత్త ప్రీపెయిడ్ ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రైవేట్ టెలికాం కంపెనీల రీఛార్జ్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు అందించే రెండు కొత్త ప్లాన్‌లను బీఎస్ఎన్ఎల్ మార్కెట్లోకి తీసుకొచ్చింది. రూ.225 ధరతో అందుబాటులో ఉన్న కొత్త ప్లాన్‌లో వినియోగదారులకు రోజుకు 2.5 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. అంటే నెలకు సుమారు 75 జీబీ డేటా అందుతుంది. దీనితో పాటు దేశవ్యాప్తంగా ఏ నెట్‌వర్క్‌కైనా అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు, అలాగే ఉచిత జాతీయ రోమింగ్ సౌకర్యం కూడా లభిస్తుంది. ఈ ప్లాన్ 30 రోజుల వాలిడిటీతో అందుబాటులో ఉంటుంది. ఇక కొత్త వినియోగదారుల కోసం బీఎస్ఎన్ఎల్ ప్రత్యేకంగా రూ.51 ధమాకా ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ప్లాన్ ద్వారా 28 రోజుల వాలిడిటీతో పాటు రోజుకు 2 జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ల సదుపాయం లభిస్తుంది. కొత్తగా నెట్‌వర్క్‌లో చేరే వినియోగదారులకు ఉచిత సిమ్ కార్డు కూడా అందజేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ ఆఫర్ జూన్ 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. తక్కువ ధరల్లో ఎక్కువ డేటా, కాలింగ్ సదుపాయాలు అందించడం ద్వారా ప్రైవేట్ టెలికాం సంస్థలకు గట్టి పోటీ ఇవ్వడమే లక్ష్యంగా బీఎస్ఎన్ఎల్ వ్యూహం రూపొందిస్తోంది.






# బంగారం ధరల్లో భారీ ఊగిసలాట

**హైదరాబాద్, జూన్ 23 :** బంగారం ధరలు అంచనాలకు అందని విధంగా మారుతూ వినియోగదారులను అయోమయానికి గురి చేస్తున్నాయి. దేశంలో నిన్న భారీగా పెరిగిన ధరలు, నేడు మళ్లీ అదే స్థాయిలో తగ్గడం బులియన్ మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం నేటి ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,910గా నమోదైంది. ఇది క్రితం ముగింపుతో పోలిస్తే రూ.2,070 తగ్గుదలగా ఉంది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,750కి పడిపోయింది. 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,09,440గా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా కూడా ఇదే ధోరణి కనిపించింది. వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,45,910గా ఉండగా, 22 క్యారెట్లు రూ.1,33,750 వద్ద, 18 క్యారెట్లు రూ.1,09,440 వద్ద స్థిరంగా ఉన్నాయి. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి ఆంధ్రప్రదేశ్ నగరాల్లో కూడా ఇదే ధరలు నమోదయ్యాయి. ముంబై, కోల్‌కతా, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లోనూ ధరల్లో పెద్ద మార్పులు లేవు. అయితే చెన్నైలో మాత్రం స్వల్పంగా పెరుగుదల కనిపించింది. అక్కడ 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,930గా నమోదైంది. న్యూఢిల్లీ, జైపూర్ నగరాల్లో కూడా స్వల్ప తేడాలు ఉన్నప్పటికీ మొత్తం మీద దేశవ్యాప్తంగా బంగారం ధరలు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. ఇటీవలి రోజులుగా అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న మార్పులు, డాలర్ మారకం విలువలో ఒడిదుడుకులు, పెట్టుబడిదారుల ఆసక్తి మార్పులు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో కూడా ఈ ధరల్లో మరింత ఊగిసలాట ఉండే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

# ఐఫోన్ 18 సిరీస్‌పై లీకులు

## ఫోల్డబుల్ ఐఫోన్‌పై టెక్ ప్రపంచంలో చర్చ

**హైదరాబాద్, జూన్ 23 :** గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ రాబోయే ఐఫోన్ 18 సిరీస్‌పై టెక్ ప్రపంచంలో భారీ ఆసక్తి నెలకొంది. తాజా లీకులు, అంచనాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. కొత్త తరం ఐఫోన్‌లతో పాటు యాపిల్ చరిత్రలోనే మొట్టమొదటిసారి ఫోల్డబుల్ ఐఫోన్ కూడా ఇదే సిరీస్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని టెక్ విశ్లేషకులు చెబుతున్నారు. లీకుల ప్రకారం 2026 సెప్టెంబర్‌లో జరిగే యాపిల్ గ్లోబల్ ఈవెంట్‌లో ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ మోడల్స్‌తో పాటు ఫోల్డబుల్ ఐఫోన్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉంది. అయితే సాధారణ ఐఫోన్ 18 బేస్ మోడల్ విడుదల మాత్రం 2027 ప్రారంభానికి వాయిదా పడవచ్చని సమాచారం. అదే సమయంలో ఐఫోన్ 18ఈ, అలాగే కొత్త డిజైన్‌తో రానున్న ఐఫోన్ ఎయిర్ కూడా 2027లో మార్కెట్‌లోకి రావచ్చని అంచనాలు వినిపిస్తున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న మెమరీ చిప్ కొరత కారణంగా ఈసారి ఐఫోన్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉత్పత్తి ఖర్చులు పెరగడం వల్ల యాపిల్ పాత ధరలకే కొత్త మోడల్స్ అందించడం కష్టమవుతుందని టెక్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కొత్త ఫీచర్లు, ఆధునిక డిజైన్, ఫోల్డబుల్ టెక్నాలజీ వంటి అప్‌గ్రేడ్స్‌తో ఐఫోన్ 18 సిరీస్ యాపిల్ వినియోగదారులకు పూర్తిగా కొత్త అనుభవాన్ని అందించనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# వేదాంత షేర్లలో భారీ పతనం

**ముంబై, జూన్ 23 :** భారత స్టాక్ మార్కెట్‌లో మెటల్స్ అండ్ మైనింగ్ దిగ్గజం వేదాంత లిమిటెడ్ షేర్లు మంగళవారం భారీగా కుదేలయ్యాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కంపెనీ షేర్లు ఒక దశలో 8.77 శాతం వరకు పతనమై రూ. 279 స్థాయికి పడిపోయాయి. భారీ బ్లాక్ డీల్ కారణంగానే ఈ అమ్మకాల ఒత్తిడి పెరిగిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్ సమాచారం ప్రకారం సుమారు 7.3 కోట్ల షేర్లు బ్లాక్ విండో ద్వారా చేతులు మారాయి. ఒక్కో షేరు ధర రూ. 292 వద్ద సుమారు రూ. 2,149 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. వేదాంత ప్రమోటర్ సంస్థ అయిన ట్విన్‌స్టార్ హోల్డింగ్స్ తన వాటాలోని సుమారు 1.7 శాతం వాటాను విక్రయించడమే ఈ భారీ కదలికకు కారణమని తెలుస్తోంది. ఈ లావాదేవీకి సిటీ బ్యాంక్ వ్యవహరించినట్లు సమాచారం. ముందుగా రూ. 291 ఫ్లోర్ ధరగా నిర్ణయించినప్పటికీ, అంచనాలకన్నా ఎక్కువ షేర్లు డీల్‌లో భాగమయ్యాయని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. డీమెర్జర్ తర్వాత వేదాంత గ్రూప్‌కు చెందిన నాలుగు కొత్త కంపెనీలు ఇప్పటికే స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అయ్యాయి. వీటిలో వేదాంత అల్యూమినియం మెటల్, వేదాంత పవర్, వేదాంత ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంత ఐరన్ అండ్ స్టీల్ సంస్థలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఇటీవలే వేదాంత గ్రూప్‌కు ప్రముఖ రేటింగ్ సంస్థ 'ఐసిఆర్ఏ' నుంచి 'ఏఏ ప్లస్' స్థాయి క్రెడిట్ రేటింగ్ లభించడం గమనార్హం. అయినప్పటికీ, బ్లాక్ డీల్ ప్రభావంతో తక్షణ మార్కెట్ ఒత్తిడి షేర్లపై తీవ్ర ప్రభావం చూపిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



# టెస్టు కెప్టెన్సీకి టైమొచ్చింది..

## స్వదేశంలో ఎంగరవాకు తొలి పరీక్ష!



జింబాబ్వేకు వన్డేల్లో సారథ్యం వహిస్తున్న రిచర్చ్ ఎంగరవా(=అఎష్ఘుతీస చీస్త్రుతీఘుఝు) టెస్టుల్లోనూ జట్టును నడిపించనున్నాడు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో ఏకైక టెస్టుకోసం స్క్వాడ్‌ను ప్రకటించిన సెలెక్టర్లు ఎంగరవాను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడికిదే తొలి పరీక్ష. స్వదేశంలో జూన్ 28న మొదలయ్యే ఈ మ్యాచ్‌తో జట్టును గెలుపు దిశగా నడిపించేందుకు సిద్ధమవుతున్నాడీ పొడగరి పేసర్. ఏకైక టెస్టుకోసం ఎంపిక చేసిన 15మంది బృందంలో స్టార్ ఆల్‌రౌండర్ సికిందర్ రజాకు చోటు దక్కలేదు. ఇంగ్లండ్ వేదికగా జరిగే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు రజా కట్టుబడి ఉండడంతో అతడిని పక్కన పెట్టేశారు. నిరుడు ఏప్రిల్ -- మే నెలలో జింబాబ్వే, బంగ్లాదేశ్ రెండు టెస్ట్‌ల్లో తలపడ్డాయి. తొలి మ్యాచ్‌లో జింబాబ్వే మూడు వికెట్ల విజయం సాధించింది. కానీ, రెండో మ్యాచ్‌లో గెలుపొందిన బంగ్లా సిరీస్‌ను సమం చేసి పరువు కాపాడుకుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఇరుజట్లు ఏకైక టెస్టులో విజయంపై కన్నేశాయి. జూన్ 28న హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో మ్యాచ్ జరుగనుంది.

**జింబాబ్వే స్క్వాడ్ :** రిచర్డ్ ఎంగరవా(కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, తనకా చివంగా, గ్రేమీ క్రెమర్, క్రేగ్ ఎర్విన్, బ్రాడ్ ఎవాన్స్, ఇన్నోసెంట్ కైయా, రాయ్ కైయా, వెస్లీ మధెవెరె, తడివనషె మరుమని, బ్లెస్సింగ్ ముజరబని, న్యూమాన్ న్యామ్‌హురి, బ్రెండన్ టేలర్, తఫడ్జ్వ త్సిగా.



# ఐర్లాండ్ సిరీస్‌కు నితీశ కుమార్ రెడ్డి దూరం

**ముంబై, జూన్ 23 :** భారత ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. తొడ కండరాల గాయం కారణంగా అతను జట్టుకు అందుబాటులో లేకుండా పోయినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో ఫీల్డ్ చేస్తూ గాయపడిన నితీశ్, అనంతరం జరిగిన పరీక్షల్లో ఎడమ కాలి కండరంలో వాపు ఉన్నట్లు ఎంఆర్ఐ స్కానింగ్‌లో తేలింది. ప్రస్తుతం అతను బెంగళూరులోని సీఓఈలో వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నాడు. పూర్తిగా కోలుకోవడానికి కనీసం నాలుగు వారాల సమయం పడుతుందని వైద్యులు అంచనా వేస్తున్నారు. అయితే గాయం తీవ్రతను బట్టి ఈ గడువు మరింత పెరిగే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం. ఇక నితీశ్ స్థానంలో యువ ఆటగాడు సూర్యాన్ష్ షెడ్జ్‌ను ఎంపిక చేసినట్లు జట్టు మేనేజ్‌మెంట్ తెలిపింది. ఇటీవల ఇండియా-ఏ జట్టులో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సూర్యాన్ష్, శ్రీలంకలో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లో 147 పరుగులు చేశాడు. అలాగే ముంబై జట్టు తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 251 స్ట్రైక్ రేటుతో 131 పరుగులు చేసి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.

# అమ్మ నగలు అమ్మి క్రికెట్ కిట్ కొనిచ్చింది

## క్రాంతి గౌడ్ భావోద్వేగం

**న్యూఢిల్లీ, జూన్ 23 :** టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్ క్రాంతి గౌడ్ తన క్రికెట్ ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలు, కుటుంబం చేసిన త్యాగాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తన క్రికెట్ కిట్ కోసం తన తల్లి నగలు అమ్మి సహాయం చేసిందని ఆమె వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన తాను అంతర్జాతీయ స్థాయికి చేరడం సులభం కాలేదని క్రాంతి తెలిపారు. చిన్న వయసులోనే గ్రామంలో ఆడపిల్లలు బయటకు రావడానికే విమర్శలు ఎదుర్కొనేవారని, అయినా కష్టపడి సాధన కొనసాగించినట్లు చెప్పారు. కుటుంబ మద్దతు తన కెరీర్‌కు పెద్ద బలమని ఆమె స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తన కలను నమ్మి ఎప్పుడూ ప్రోత్సహించారని, ఆర్థిక ఇబ్బందుల సమయంలో తల్లి తన నగలు అమ్మి క్రికెట్ కిట్ కొనిచ్చిన ఘటనను ఆమె భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. ఇంగ్లండ్ పర్యటనలో ఒక మ్యాచ్‌లో 52 పరుగులకు 6 వికెట్లు తీసి ఆమె అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ప్రపంచకప్‌లో రాణించడంతో తన స్వగ్రామంలో క్రికెట్ అకాడమీ ఏర్పడిందని క్రాంతి ఆనందం వ్యక్తం చేశారు. తనను చూసి గ్రామంలోని మరెంతో మంది అమ్మాయిలు క్రికెట్‌లోకి వస్తుండటం గర్వంగా ఉందని ఆమె తెలిపారు.





## 'పద్మ శ్రీ' అవార్డు అందుకున్న

# రోహిత్ శర్మ..

భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 'పద్మశ్రీ' అవార్డు అందుకున్నాడు. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము (ఐతీశీబజూఝుఐ వీబతీఎబ) చేతుల మీదుగా హిట్‌మ్యాన్ ఈ పురస్కారాన్ని స్వీకరించాడు. వ్యక్తిగత కారణాలతో తొలి విడతలో పద్మ అవార్డు వేడుకకు దూరమైన రోహిత్.. ఈసారి హాజరయ్యాడు. నలుపు రంగు సూట్ ధరించిన మాజీ సారథి.. రాష్ట్రపతి ముర్ము నుంచి పద్మ శ్రీ అవార్డును తీసుకోవడం చూసి అతడి భార్య రితికా సచ్‌దేహ్ తెగ సంబురపడిపోయింది. టీమిండియాకు పొట్టి ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ కట్టబెట్టినందుకు రోహిత్ శర్మ పద్మ శ్రీకి ఎంపికయ్యాడు. భారత క్రికెట్‌కు విశేష సేవలందించినందున అతడిని కేంద్ర ప్రభుత్వం అతడిని ఈ పురస్కారంతో గౌరవించింది. మే 25 న భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి హిట్‌మ్యాన్ పద్మ శ్రీని స్వీకరించాల్సింది. కానీ, వ్యక్తిగత కారణాలతో అప్పుడు దూరమైన రోహిత్.. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ఈ అవార్డును స్వీకరించాడు. నలుపు రంగు సూట్‌లో వచ్చిన రోహిత్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నమస్కించి పురస్కారం అందుకున్నాడు. అవార్డు తీసుకునేందుకు వెళ్తే.. తిరిగి వచ్చే క్రమంలోనూ రోహిత్ ప్రధాని నరేంద్ర మోడీకి నమస్కించాడు. టీ20లు, టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ ప్రస్తుతానికి వన్డేల్లోనే ఆడుతున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్న మాజీ సారథి ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన విషయం తెలిసిందే. క్రీడా విభాగంలో పద్మ శ్రీకి ఎంపికైన హాకీ ప్లేయర్ సవితా పూనియా సైతం ఇదే వేడుకలో అవార్డును స్వీకరించారు. టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్ రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ భూషణ్ అవార్డును అందుకున్నారు.



# శ్రీలంకకు చావోరేవో..

## ఐర్లాండ్ బోణీ కొట్టేనా..!




మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో నిరాశపరుస్తున్న శ్రీలంక కీలక మ్యాచ్‌కు సిద్ధమైంది. సెమీస్ ఆశలు సంక్లిష్టంగా మారిన వేళ చావోరోవే పోరులో ఐర్లాండ్‌ను ఢీ కొడుతోంది. కౌంటీ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో లంక కెప్టెన్ చమరి ఆటపట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఆడిన మూడు మ్యాచుల్లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించిన ఐర్లాండ్ పోతూ పోతూ లంక అవకాశాల్ని దెబ్బతీయాలనుకుంటోంది. గ్రూప్ బీలోని శ్రీలంక మూడు మ్యాచుల్లో ఒకే విజయంతో సెమీస్ రేసులో వెనకబడింది. హ్యాట్రిక్ విజయాలు సాధించిన వెస్టిండీస్, ఇంగ్లండ్ ఆరేసి పాయింట్లతో టాప్-2లో నిలవగా.. స్కాట్లాండ్‌ను ఓడించిన న్యూజిలాండ్ మూడో స్థానం దక్కించుకుంది. ఇప్పటికే మూడు ఓటములతో టోర్నీ నుంచి వైదొలిగిన ఐర్లాండ్.. లంకపై విజయంతో ఖాతా తెరవాలనే కసితో ఉంది.

**శ్రీలంక తుది జట్టు :** చమరి ఆటపట్టు(కెప్టెన్), ఇమేష దులానీ, హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, హన్సిమ కరుణరత్నే, కవిష దిల్హరి, నీలాక్షిక సిల్వా, కౌషాని నుత్యాంగన(వికెట్ కీపర్), సుగంధ కుమారి, నిమష మీపగే, మిథాలీ అయోధ్య.

**ఐర్లాండ్ తుది జట్టు :** అమీ హంటర్(వికెట్ కీపర్), గబి లెవిస్(కెప్టెన్), ఒర్లా ప్రెండెర్గాస్ట్, రెబెక్కా స్టోకెల్, లూయిస్ లిటిల్, లీహ్ పౌల్, అలిసే టెక్టర్, అర్లెనా కెల్లీ, ఐమీ మగీరే, కారా ముర్రే, లారా మెక్‌బ్రైడ్.




## శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో

# ఇంగ్లండ్ టూర్‌కు యువ భారత జట్టు సిద్ధం

**న్యూఢిల్లీ, జూన్ 23 :** టీ20 ప్రపంచకప్ విజయానంతరం భారత క్రికెట్ జట్టు మరో కీలక విదేశీ పర్యటనకు సిద్ధమైంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని యువ జట్టు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటన కోసం బయల్దేరింది. ఈ పర్యటనలో భారత్ తొలుత ఐర్లాండ్‌తో డబ్లిన్‌లో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. అనంతరం ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లు జరగనున్నాయి. ఇది టీ20 ప్రపంచకప్ తర్వాత భారత జట్టు ఆడుతున్న తొలి ద్వైపాక్షిక టీ20 సిరీస్ కావడం విశేషం. ఈ పర్యటనలో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ జట్టులోకి ఎంపికై ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తూ అత్యంత పిన్న వయస్కుడిగా భారత సీనియర్ జట్టులో చోటు సంపాదించడం విశేషం. అలాగే ప్రిన్స్ యాదవ్ కూడా తొలిసారి టీ20 జట్టులోకి వచ్చాడు. వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తిరిగి జట్టులోకి రానున్నాడు. సిరాజ్ స్థానంలో ప్రసిధ్ కృష్ణను జట్టులోకి తీసుకోగా, హర్షిత్ రాణా మరియు రవి బిష్ణోయ్ కూడా తిరిగి జట్టులో చోటు దక్కించుకున్నారు. టీ20 సిరీస్ జూలై 1 నుంచి 11 వరకు జరగనుండగా, వన్డే సిరీస్ జూలై 14 నుంచి 19 వరకు కొనసాగనుంది.





# విజయ్-త్రిషపై మళ్లీ ఊహాగానాలు

కోలీవుడ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన తెరజంటల్లో దళపతి విజయ్, త్రిష జోడీకి ప్రత్యేక స్థానం ఉంది. పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించిన ఈ ఇద్దరి మధ్య ఉన్న తెరపై కెమిస్ట్రీ ఎప్పుడూ అభిమానులను ఆకట్టుకుంది. అయితే గత కొంతకాలంగా వీరి వ్యక్తిగత అనుబంధంపై కూడా సామాజిక మాధ్యమాల్లో రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. తాజాగా విజయ్ పుట్టినరోజు సందర్భంగా త్రిష ఎలాంటి శుభాకాంక్షల సందేశం పెట్టకపోవడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దీంతో వీరిద్దరి మధ్య ఏమైనా దూరం పెరిగిందా అనే అనుమానాలు అభిమాన వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా విజయ్, త్రిషలు పలు కార్యక్రమాల్లో కలిసి కనిపించడం, ఒకరి సినిమాలకు మరొకరు మద్దతు ఇవ్వడం, వ్యక్తిగత వేడుకల్లో హాజరవడం వంటి పరిణామాలు అభిమానుల్లో ఆసక్తి పెంచాయి. ఈ క్రమంలో వీరిద్దరి స్నేహం కేవలం సహనటుల సంబంధాన్ని మించి ఉండొచ్చని సామాజిక మాధ్యమాల్లో ఎన్నో కథనాలు వెలువడ్డాయి. అదే సమయంలో విజయ్ వ్యక్తిగత జీవితంపై కూడా పలు ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ అంశాలపై విజయ్ గానీ, త్రిష గానీ ఎప్పుడూ బహిరంగంగా స్పందించలేదు. అధికారిక ప్రకటనలేమీ లేకపోయినా, వీరి గురించి వచ్చే ప్రతి చిన్న పరిణామం అభిమానుల్లో పెద్ద చర్చకు దారి తీస్తూనే ఉంది. ఈసారి విజయ్ పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక మాధ్యమాలు విజయ్‌కు సంబంధించిన పోస్టులు, చిత్రాలు, వీడియోలతో నిండిపోయాయి. ఇలాంటి సమయంలో ప్రతి ఏడాది విజయ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెప్పే త్రిష ఈసారి పూర్తిగా మౌనం పాటించడం అందరి దృష్టిని ఆకర్షించింది. త్రిష సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తరచూ తన చిత్రాల అప్‌డేట్లు, వ్యక్తిగత ఫొటోలు పంచుకుంటూ ఉంటారు. అలాంటి త్రిష విజయ్ పుట్టినరోజు వంటి సందర్భంలో స్పందించకపోవడంతో అభిమానుల్లో పలు రకాల వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారాల ప్రకారం విజయ్ ప్రస్తుతం తన కుటుంబ జీవితం, రాజకీయ బాధ్యతలపై మరింత దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో త్రిష కూడా వ్యక్తిగత అంశాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తూ కొంత దూరం పాటిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ఇప్పటివరకు కేవలం ప్రచారాలుగానే మిగిలాయి. విజయ్ లేదా త్రిష తరఫున ఎలాంటి స్పష్టత రాకపోవడంతో నిజానిజాలు తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు అభిమానులు త్రిష ఈసారి శుభాకాంక్షలు చెప్పకపోవడాన్ని సాధారణ విషయంగానే తీసుకుంటుండగా, మరికొందరు మాత్రం దీనిని ఇద్దరి మధ్య సంబంధాల్లో మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు. మొత్తానికి విజయ్-త్రిష పేర్లు మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చకు రావడానికి ఈ ఒక్క విషయం చాలిపోయింది. అయితే సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన ప్రచారాల విషయంలో అధికారిక సమాచారం వచ్చే వరకు జాగ్రత్తగా వ్యవహరించడం అవసరమని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం విజయ్ రాజకీయాల వైపు అడుగులు వేస్తూ కొత్త బాధ్యతల్లో నిమగ్నమై ఉండగా, త్రిష వరుస సినిమాలతో తన కెరీర్‌ను ముందుకు తీసుకెళు తున్నారు. ఇలాంటి సమయంలో వ్యక్తిగత ప్రచారాల కంటే వారి వృత్తి జీవితానికే ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

# 'మా ఇంటి బంగారం' బృందాన్ని అభినందించిన చిరంజీవి



స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతోంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకు సానుకూల స్పందన రావడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లు నమోదవుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా వీక్షించిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ 'మా ఇంటి బంగారం' ఎంతో ఆసక్తికరంగా అనిపించిందని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబం నేపథ్యంగా యాక్షన్, భావోద్వేగాలను చక్కగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో చిత్రాన్ని వినోదాత్మకంగా మలిచారని ప్రశంసించారు. కుటుంబ బంధాలు, అనుబంధాలు, భావోద్వేగాలు కలిసిన కథను ఆకట్టుకునే రీతిలో తెరపై ఆవిష్కరించారని ఆయన అభినందించినట్లు సమాచారం. కథనం నడిపించిన తీరు, పాత్రల మలుపులు, వినోదాన్ని జోడించిన విధానం చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయని చిరంజీవి అభిప్రాయపడ్డారని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. సమంత నటనపై కూడా చిరంజీవి ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, భావోద్వేగ దృశ్యాల్లోనూ సమంత తన పాత్రకు పూర్తి న్యాయం చేశారని కొనియాడినట్లు సమాచారం. మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరమని, అలాంటి కథలకు ప్రేక్షకులు కూడా ఆదరణ చూపుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ నిడిమోరు సహా మొత్తం చిత్ర బృందం అభినందనలకు అర్హులని చిరంజీవి పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక సమంత వ్యక్తిగత జీవితంపై కూడా చిరంజీవి చేసిన ఒక వ్యాఖ్య ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారి తీసింది. జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన చెప్పిన మాటలను కొందరు అభిమానులు వేర్వేరు రీతుల్లో అర్థం చేసుకుంటున్నారు. అయితే ఆ వ్యాఖ్యకు సంబంధించి ఎలాంటి అధికారిక స్పష్టత లేకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. సమంత గర్భధారణ గురించి చిరంజీవి పరోక్షంగా సంకేతం ఇచ్చారా అనే చర్చ కూడా కొన్ని వర్గాల్లో కనిపిస్తోంది. అయితే దీనిపై సమంత, రాజ్ నిడిమోరు లేదా చిరంజీవి తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ఈ తరహా ప్రచారాలను జాగ్రత్తగా మాత్రమే చూడాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే 'మా ఇంటి బంగారం'కు లభిస్తున్న ఆదరణ, సమంత నటనకు వస్తున్న ప్రశంసలు, ఇప్పుడు చిరంజీవి అభినందనలు కలిసి ఈ చిత్రానికి మరింత ప్రచారం తీసుకొచ్చాయి. మొదటి రోజునుంచే కుటుంబ నేపథ్యం, భావోద్వేగ సన్నివేశాలు, యాక్షన్ మేళవింపుతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, సమంత కెరీర్‌లో మరో గుర్తుండిపోయే చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణతో పాటు పరిశ్రమ ప్రముఖుల ప్రశంసలు కూడా బలాన్నిస్తున్నాయి.

# బాహుబలి: ది ఎటర్నల్ వార్

## కీలక అప్‌డేట్‌ను అందించిన ప్రభాస్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ అందించారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ప్రభాస్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యానిమేషన్ రూపంలో ప్రభాస్ యోధుడి అవతారంలో కనిపించడం అభిమానులకు గూస్‌బంప్స్ కలిగిస్తోంది. 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యానిమేషన్ ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌లోని 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఎంపిక కావడం భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ ఫెస్టివల్‌లో నిర్వహించే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యానిమేషన్ రంగానికి చెందిన ప్రముఖులు, స్టూడియోలు, నిర్మాతలు, దర్శకుల సమక్షంలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించబడనుండటం విశేషం. ప్రభాస్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఆయన చేసిన పోస్ట్ కొద్ది నిమిషాల్లోనే లక్షలాది లైక్స్, వేలాది కామెంట్లను సొంతం చేసుకుంది. ఈ యానిమేషన్ చిత్రాన్ని ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌కు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ యానిమేషన్ దర్శకుడు ఇషాన్ శుక్లా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రభాస్ తన పోస్ట్‌లో .. బాహుబలి: ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్ అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా అద్భుతమైన పనిని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని పేర్కొన్నారు.



# రామ్ సినిమాలో నివేదా?

టాలీవుడ్‌లో తనదైన నటనతో పాటు గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నివేదా పేతురాజ్ మరో క్రేజీ అవకాశాన్ని దక్కించుకున్నట్లు సమాచారం. 'మెంటల్ మదిలో' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి, ఆ తర్వాత విభిన్న పాత్రలతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న రాబోయే కొత్త చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైనట్లు ఫిల్మ్ నగర్‌లో గట్టిగా ప్రచారం జరుగుతోంది. నివేదా పేతురాజ్ ఇప్పటికే తెలుగులో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. 'చిత్రలహరి', 'బ్రోచేవారెవరురా', 'అల వైకుంఠపురములో' వంటి చిత్రాల్లో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అలాగే 'బ్లడీ మేరీ' వంటి ఓటీటీ చిత్రం, 'విరాట పర్వం', 'దాస్ కా ధమ్కీ' వంటి చిత్రాల్లో కూడా విభిన్నమైన పాత్రల్లో నటించి తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఇటీవల వచ్చిన 'సింగ్ గీతం' చిత్రంతో కూడా ఆమె ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇప్పుడు రామ్ పోతినేని సరసన నటించే అవకాశం లభిస్తే ఇది ఆమె కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా మారుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. రామ్ పోతినేని ఎనర్జీకి తగ్గట్టుగా కథానాయిక పాత్రను కూడా దర్శకుడు బలంగా రూపకల్పన చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో నివేదా పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా ?




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయ-బోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్ వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ లాంగ్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com